

మరణమే శరణమా..?



గుడిబండలో చింత చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న దేవరాజ్‌నాయక్



ఉమ్మడి జిల్లాలో ఆరుగురి ఆత్మహత్య

అప్పుల బాధతో అన్నదాత

సెల్‌ఫోన్ కొనివ్వలేదని విద్యార్థి..

ఒంటరి జీవితం వద్దనుకుని ఇద్దరు..

అనారోగ్యంతో ఒకరు..

ఇంట్లోవారితో గొడవపడి మరొకరు..



కళ్యాణదుర్గంలో విలపిస్తున్న రైతు మంజు భార్య, కుటుంబ సభ్యులు

జీవితం కష్టసుఖాల సమ్మిళితం. ఒక్కోసారి ఎడతెరిపి లేకుండా కష్టాలు వెంటాడుతాయి. ఎదురొడ్డి పోరాడాలి. సమస్యలకు పరిష్కారం వెతుక్కోవాలి. అప్పులు, అనారోగ్యం, ఒంటరితనం, వేధింపులు, అవమానాలు.. ఏవైనాసరే.. సవాలుగా స్వీకరించాలి. నా అనుకున్నవారు అందరూ దూరమైనా బతికి తీరాలి. ప్రకృతిపరంగా వచ్చిన ప్రాణం సహజంగానే పోవాలి. అర్థంతరంగా తనువు చాలిస్తే.. జీవితానికి అర్థం ఉండదు. భూమ్మీద ఉన్నన్నాళ్లూ.. ప్రతి క్షణాన్నీ ఆస్వాదించాలి.. అనుభవించాలి. అది ఆనందం కావచ్చు.. ఆవేదన కావచ్చు..! 'ఇక భరించలేను..' అని అనకూడదు..! ఎందుకంటే.. భరించలేనిది ఏదీ లేదు.. ఉండదు..! అన్నింటినీ భరించగలవు కాబట్టే.. ఆ అనుభవాలు నీకు ఎదురవుతాయి. ఈ సత్యాన్ని గ్రహించాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒకే రోజు ఐదుగురు అర్థంతరంగా తనువు చాలించారు. మరొకరి ఆత్మహత్య ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ కుటుంబాలు దుఃఖంలో మునిగిపోయాయి. - వివరాలు 7లో...

మీరే పార్టీ బలం

- జెండా మోసిన కార్యకర్తలకు గుర్తింపు
- అక్రమ కేసుల మాఫీపై త్వరలో నిర్ణయం
- అభివృద్ధిలో జిల్లాను అగ్రపథంలో నిలుపుదాం
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- అట్టహాసంగా శ్రీసత్యసాయి జిల్లా మినీ మహానాడు



మాట్లాడుతున్న మంత్రి సవిత, వేదికపై టీడీపీ నాయకులు

పుట్టపర్తి, మే 24(ఆంధ్రజ్యోతి): 'తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం. మీకష్టంతోనే పార్టీ నిలబడింది. జెండా మోసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఇచ్చి, నామినేటెడ్ పదవులతో సముచిత స్థానం కల్పిస్తాం. మీ కష్టాల్లో తోడుగా ఉంటాం' అంటూ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. అభివృద్ధిలో జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపి, అందరికీ సంక్షేమాన్ని కొనసాగిస్తామన్నారు. జిల్లా కేంద్రం కప్పలబండ పారిశ్రామిక పార్కులో శనివారం జిల్లా మినీ మహానాడు సభను అట్టహాసంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప అధ్యతన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సవిత, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కందికుంట వెంకటప్రసాద్, పల్లెసిందూరారెడ్డి, ఎంఎస్ రాజు, పార్టీ ప్రతినిధులు హాజరయ్యారు. తొలుత సభ వేదిక వద్ద టీడీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గత రెండేళ్లలో మరణించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతోపాటు ఆపరేషన్ సిందూర్‌లో అమరుడైన మురళీనాయక్‌కు నివాళుల ర్పించారు. కాగా మినీ మహానాడుకు జిల్లా వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు భారీగా తరలివచ్చాయి. వైసీపీ నాయకులు గత ఐదేళ్లు టీడీపీ శ్రేణులను తీవ్ర ఇబ్బందులు పెట్టారని ధర్మవరం నియోజకవర్గ నాయకులు సభలో వాపోయారు. వారు ఇప్పుడు రక్షణ కోసం బీజేపీ, జనసేన ముసుగులు వేసుకుని, మళ్లీ అధికారం చెలాయించే ప్రయత్నం చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ధర్మవరంపై జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు చొరవచూపి కార్యకర్తలను రక్షించాల్సిన అవసరం ఉందని విన్నవించారు.



ఈలలు వేస్తున్న మహిళా కార్యకర్త

ఎన్టీఆర్ వల్లే బడుగులకు రాజ్యాధికారం

మంత్రి సవిత మాట్లాడుతూ పేదలు, బడుగు, బలహీన వర్గాలను రాజ్యాధికారంలో భాగస్వాములను చేసిన ఘనత దివంగత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. ఆయన స్ఫూర్తిని సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ కొనసాగిస్తూ టీడీపీని బలోపేతం

(మిగతా 6వ పేజీలో)

యూపీఎస్సీ ప్రిలిమ్స్‌కు సర్వం సిద్ధం

ఏడు పరీక్షా కేంద్రాలు..

2,546 మంది అభ్యర్థులు

జిల్లా పరిశీలకుడిగా యువరాజు

అనంతపురంటౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఆదివారం జిల్లాలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. కలెక్టరేట్ వర్గాల సమాచారం మేరకు.. జిల్లాలో 2,546 మంది అభ్యర్థులు పరీక్షలు రాయబోతున్నారు. ఒకేరోజు రెండుపూటల పరీక్షలు కొనసాగుతాయి. పేపర్- 1 పరీక్ష ఉదయం 9-30 నుంచి 11-30 గంటల వరకు, పేపర్-2 మధ్యాహ్నం 2-30 గంటల నుంచి సాయంత్రం 4-30 గంటల వరకు కొనసాగుతాయి. పరీక్షల నిర్వహణకు ఏడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రానికి ఒక పర్యవేక్షణ అధికారిని, రూట్ ఆఫీసర్‌ను నియమించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఆయా కేంద్రాల వద్ద ముందు, వెనుక భాగాల్లో జామర్లను ఏర్పాటు చేశారు. పరీక్షలను పర్యవేక్షించడానికి రాష్ట్రశాఖ నుంచి ఐఏఎస్ అధికారి యువరాజును నియమించారు. కలెక్టర్ వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ పరీక్షల నిర్వహణపై ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. అభ్యర్థులు గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, అరగంట సమయం వరకు అవకాశం ఇస్తామని, తర్వాత వచ్చిన వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించబోమని కలెక్టర్ ఇప్పటికే ప్రకటించారు. అభ్యర్థుల ఇబ్బందులను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశారు.

నయా పంచాయతీలు

- క్లస్టర్లకు స్వస్తి.. గ్రేడ్లకు శ్రీకారం
- కొత్తగా స్పెషల్ గ్రేడ్ అమలులోకి..
- జిల్లాలో 14 స్పెషల్ గ్రేడ్ పంచాయతీలు
- కమిషనర్ ఆమోదానికి ఫైల్



అనంతపురం న్యూటౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పంచాయతీల ముఖచిత్రం మారనుంది. ఇప్పటి వరకు ఉన్న క్లస్టర్ వ్యవస్థకు స్వస్తి చెప్పి గ్రేడ్ వ్యవస్థ అమలుకు యంత్రాంగం శ్రీకారం చుట్టింది. ఈక్రమంలోనే జనాభా, ఆదాయం రెండు ఎక్కువ ఉన్న పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా పరిగణించనున్నారు. అందుకు అనుగుణంగా ఇప్పటికే అధికార యంత్రాంగం కసరత్తు పూర్తి చేసి, అమలుకు సంబంధిత ఫైలును పంచాయతీరాజ్ కమిషనర్‌కు పంపారు. అక్కడ నుంచి వచ్చే ఉత్తర్వుల మేరకు స్థానిక సిబ్బంది అమలు చేయనున్నారు.

స్పెషల్ గ్రేడ్ పంచాయతీల గుర్తింపు ఇలా..

ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఇప్పటి వరకు గ్రేడ్-1 పంచాయతీలుగా ఉన్న వాటి స్థానంలో స్పెషల్ గ్రేడ్ అమలు చేయను న్నారు. వాటిలో 10 వేలకు పైబడి జనాభా లేదా కోటికి పైగా ఆదాయం ఉన్న పంచాయతీలను స్పెషల్ గ్రేడ్‌గా గు ర్తించారు. ఆదాయం, జనాభా రెండూ ఎక్కువ ఉన్నవాటిలో అనంతపురం రూరల్‌లోని నారాయణ పురం, కక్కలపల్లి కాలనీ, రుద్రంపేట, బుక్కరాయసముద్రం, నార్పల, గార్లదిన్నె, తాడిపత్రి మండలంలోని గన్నేవారిపల్లి, ఉరవకొండ, యాడికిలను ఎంపిక చేశారు. ఆదాయం మాత్రమే ఎక్కువ ఉన్న పంచాయతీల్లో అనంతపురం రూరల్‌తో పాటు రాచానపల్లిని ఎం పిక చేశారు. ఆదా యం లేకపోయిన జనాభా ఉన్న కారణంగా గార్లదిన్నె మండలంలోని కల్లూరు, కంబదూరు, కణేకల్లు, పామిడి పంచాయతీ లను సైతం స్పెషల్ గ్రేడ్ కింద గుర్తించారు. ఈక్రమంలో జిల్లాలో మొత్తం 14 స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా రూపాంతరం చెందనున్నాయి.

మండలాలవారిగా గ్రేడ్స్‌కు ఎంపికైన పంచాయతీలు ఇలా..

జనాభా నాలుగు వేల నుంచి పది వేల లోపు ఉండి, ఆదాయం రూ.50 లక్షల నుంచి రూ.కోటిలోపు ఉన్న పంచాయతీలను గ్రేడ్-1 కింద పరిగణిస్తారు. ఆదాయంతో సంబంధం లేకుండా జనాభా ప్రాతిపదికన గ్రేడ్-2, గ్రేడ్-3 పంచాయతీలను ఎంపిక చేశారు. 1500 నుంచి 3వేలలోపు జనాభా ఉన్న వాటిని గ్రేడ్-2 కింద, 1500 లోపు జనాభా ఉన్న పంచాయతీలను గ్రేడ్-3గా విభజించారు. జిల్లా వ్యాప్తంగా మండలాల వారిగా ఏ గ్రేడ్ లో ఎన్ని పంచాయతీలు ఉన్నాయన్న వివరాలు ఇలా..

మండలం	గ్రేడ్-1	గ్రేడ్-2	గ్రేడ్-3
1. అనంతపురం రూరల్	5	9	6
2. ఆత్మకూరు	1	7	9
3. బుక్కరాయసముద్రం	2	8	8
4. బెళుగుప్ప	2	6	11
5. బొమ్మనహాళ్	4	9	6
6. బ్రహ్మసముద్రం	4	5	7
7. డీ హీరేహాళ్	3	8	5
8. గార్లదిన్నె	2	5	10
9. గుత్తి	-	5	19
10. గుమ్మఘట్ట	4	10	1
11. గుంతకల్లు	-	10	15
12. కళ్యాణదుర్గం	2	12	3
13. కంబదూరు	1	9	1
14. కణేకల్లు	2	10	5
15. కూడేరు	1	10	3
16. కుందుర్పి	5	8	-
17. నార్పల	-	8	8
18. పామిడి	-	4	15
19. పెద్దపప్పూరు	1	4	15
20. పెద్దవడుగూరు	2	2	21
21. పుట్లూరు	2	1	20
22. రాప్తాడు	2	4	10
23. రాయదుర్గం	1	8	10
24 శెట్టూరు	1	12	3
25. శింగనమల	2	8	9
26. తాడిపత్రి	1	8	16
27. ఉరవకొండ	3	4	10
28. వజ్రకరూరు	2	6	11
29. విడపనకల్లు	4	9	4
30. యాడికి	1	7	5
31. యల్లనూరు	2	2	17

విద్యకు గురువే మూలాధారం

గాన కళాభూషణ డాక్టర్ వాగీష్ కృష్ణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వాగీష్ కృష్ణ

అనంతపురం కల్చరల్, మే 24(ఆంధ్రజ్యోతి): ఏ విద్యలో రాణించాలన్నా గురువే మూలాధారమని గాన కళాభూషణ డాక్టర్ వాగీష్ కృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని త్యాగరాజ సంగీత సభ ప్రాంగణంలో ఆలిండియా రేడియో విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ జనరల్, గాన కళాభూషణ డాక్టర్ వాగీష్ కృష్ణ, ప్రపంచ ఖ్యాతి గడించిన వయొలిన్ కళాకారుడు పప్పుజ్ఞానదేవ్, మృదంగం కళాకారుడు పెరవలి జయభాస్కర్ బృందం శాస్త్రీయ సంగీత కచేరీ నిర్వహించింది. వాగీష్ కృష్ణ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం త్యాగరాజ సంగీత సభ కార్యవర్గం ఆధ్వర్యంలో కళాకారులను జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ వాగీష్ కృష్ణ మాట్లాడుతూ.. సంగీతం, నృత్యం వంటి సంప్రదాయ కళలను గురువుద్వారానే నేర్చుకోవాలని అన్నారు. గురువు లేని విద్య వ్యర్థమని గ్రహించాలన్నారు. అనంతరం నిర్వహించిన సంగీత కచేరిలో పప్పుజ్ఞానదేవ్ వయొలిన్, పెరవలి విజయభాస్కర్ మృదంగం సహకారమందిస్తుండగా డాక్టర్ వాగీష్ కృష్ణ తన మధురగాత్రంతో కీర్తనలు ఆలపించారు. 'ఓ రామ నీ నామం ఎంతో రుచిరా', 'భద్రాచల రామదాసు కీర్తన', 'వీర హనుమ బహు పరాక్రమ', 'పురందరదాసు కీర్తన'లతో అందరినీ ఓలలాడించారు. కార్యక్రమంలో త్యాగరాజ సంగీత సభ వ్యవస్థాపకుడు జ్ఞానేశ్వరరావు, అధ్యక్షుడు ఎన్‌సీ సంపత్‌కుమార్, డాక్టర్ హరిశ్చంద్రరామ, హరికృష్ణ, రోహిణి, కళాకారులు లతాశ్యామ్, వీరాస్వామి, మొదలి మురళీకృష్ణ, ఎస్కేయూ విశ్రాంత ప్రొఫెసర్ సుధాకర్‌బాబు, శ్రీవైష్ణవ సంఘం జిల్లా అధ్యక్షుడు జ్వాలాపురం శ్రీకాంత్, లంకా ప్రసాద్, విశ్రాంత తహసీల్దారు పాలసముద్రం నాగరాజు, పద్మజ, శ్రీదేవి, ప్రభావతి పాల్గొన్నారు.

జంక్షన్‌లో టెన్షన్..!

ప్రమాదాలకు కేరాఫ్‌గా తలగాసిపల్లి జంక్షన్

బెంబేలెత్తుతున్న వాహనదారులు



ప్రమాదాలకు కేరాఫ్‌గా మారిన తలగాసిపల్లి జంక్షన్



తలగాసిపల్లి జంక్షన్‌లో కూలీల ఆటోను ఢీకొన్న బస్సు

గార్లదిన్నె, మే 24(ఆంధ్రజ్యోతి): మండలం గుండా 44వ జాతీయ రహదారి వెళ్తుంది. రహదారి జంక్షన్లు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. మండలంలో జాతీయ రహదారిపై ఉన్న తలగాసిపల్లి, కల్లూరు, తరిమెల జంక్షన్లలో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. దీంతో ఆ జంక్షన్లలో ప్రయాణమంటేనే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. ఆయా జంక్షన్లలో జరుగుతున్న ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. మరికొందరు తీవ్రంగా గాయపడి ఆస్పత్రుల పాలవుతున్నారు. పలువురు కాళ్లు, చేతులు విరిగి, మంచానికి పరిమితమవుతున్నారు.

పట్టించుకోని అధికారులు

తలగాసిపల్లి, కల్లూరు, తరిమెల జంక్షన్లలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవట్లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రమాదాలు జరిగినపుడు రెండు, మూడురోజులు మాత్రం హంగామా చేసి.. తర్వాత పట్టించుకోరన్నది బహిరంగ రహస్యమే. ప్రమాదాల నివారణకు శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ప్రమాదాల్లో కొన్ని..

- ఇటీవల పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామానికి చెందిన 13 మంది కూలీలు మండలంలోని తిమ్మంపేట గ్రామ సమీపాన అరటి తోటలో కూలి పనులకు వచ్చారు. తిరిగి వెళ్తుండగా తలగాసిపల్లి జంక్షన్‌లో కూలీల ఆటోను బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో 8 మంది కూలీలు మృతిచెందగా.. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు.
- కల్లూరు జంక్షన్ వద్ద కేశవాపురానికి చెందిన శివ అనే కూలీపై టమోటా లారీ పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.
- పది రోజుల క్రితం మహబూబ్‌నగర్‌కు చెందిన బాదరప్ప అనే వ్యక్తి ద్విచక్రవాహన ప్రమాదంలో మృతిచెందాడు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం



రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపడుతున్నాం. రోజూ 44వ జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల్లో సభలు ఏర్పాటు చేసి, జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు తెలియజేస్తున్నాం. మలుపుల వద్ద, ప్రమాద ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించాం. అతివేగంగా వెళ్లే వాహనాలకు జరిమానా విధిస్తున్నాం.

- మహమ్మద్ గౌసబాషా, ఎస్‌ఐ, గార్లదిన్నె

రోగులకు మెరుగైన సేవలే లక్ష్యం

రూ.75 లక్షలతో విశ్రాంతిధామం

అనంత ఆసుపత్రిని 1200 పడకల స్థాయికి పెంచుతాం

ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి వెల్లడి



భూమిపూజ చేస్తున్న నాయకులు, అధికారులు

అనంతపురం టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం జిల్లా ఆసుపత్రిలో రూ.75 లక్షల ఎంపీ నిధులతో రోగుల సహాయకుల కోసం నిర్మిస్తున్న విశ్రాంతిధామం భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు అహుడా చైర్మన్ వరుణ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, వైద్యాధికారుల ఆధ్వర్యంలో అట్టహాసంగా భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా మాట్లాడుతూ.. ఎంపీ నిధులతో జిల్లా ఆసుపత్రిలో రోగుల సహాయకుల కోసం విశ్రాంతి భవనాలు ఏర్పాటు చేయిస్తుండడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రతి రోజూ వందలమంది ఆసుపత్రికి వస్తున్నారని, విశ్రాంతి భవనాలులేక ఎన్నో వ్యవ ప్రయాసాలు పడుతున్నారని అన్నారు. తాము ఇక్కడికి వచ్చినపుడు వారుపడుతున్న ఇబ్బందులను చూసి ప్రత్యేక భవనాలు ఏర్పాటు చేయడానికి నిర్ణయించామని అన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. అనంత సర్వజన ఆసుపత్రి అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని తెలిపారు. రోగుల సంఖ్య విపరీతంగా పెరగడంతో ఆసుపత్రిని 1200 పడకల స్థాయికి పెంచాలని ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయామని తెలిపారు. ఇందుకు సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని, త్వరలో ఆ కళ నెరవేరబోతుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, డిప్యూటీ ఆర్ఎంఓలు హేమలత, పద్మజ, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శ్రీనివాస్‌నాయుడు, మాజీ మేయర్ మదమంచి స్వరూప, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కోనంకి గంగారామ్, రత్నమయ్య, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బదిలీలకు 7,031 మంది దరఖాస్తు

3,140 మంది దరఖాస్తుల ఆమోదం

అనంతపురం విద్య, మే 24(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి వరకూ 7,031 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులోఓ ఇప్పటి వరకూ 3,140 దరఖాస్తులకు ఆమోదముద్ర పడింది. ప్రైమరీ హెచ్ఎంలు 200 మంది దరఖాస్తు చేయగా, 85 దరఖాస్తులను ఆమోదించారు. స్కూల్ అసిస్టెంట్లు (లాంగ్వేజ్) నుంచి 1,618 దరఖాస్తులు రాగా, 1004 మంది దరఖాస్తులకు ఆమోదం లభించింది. స్కూల్ అసిస్టెంట్లు (నాన్ లాంగ్వేజ్) నుంచి 2,865 మంది దరఖాస్తు చేసుకోగా 1,781 మందికి ఆమోదం లభించింది. ఎస్‌జీటీల నుంచి 2,348 మంది దరఖాస్తు చేయగా 270 దరఖాస్తులను మాత్రమే ఆమోదించారు. స్కూల్ అసిస్టెంట్ల దరఖాస్తు గడువు ఆదివారం మధ్యాహ్నం వరకూ పొడిగించే అవకాశం ఉంది.

మీరే పార్టీ బలం



మినీమహానాడులో ఐక్యత చాటుతున్న నాయకులు

(ఐదో పేజీ తరువాయి)
చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జోరుగా సాగుతున్నాయన్నారు. చంద్రబాబు ముందుచూపుతోనే ఉమ్మడి జిల్లాకు హంద్రీ నీవా, కియ కార్ల పరిశ్రమ వచ్చినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం టీడీపీ నాయకులు, కార్యకర్తలపై బనాయించిన అక్రమ కేసుల మాఫీపైనా త్వరలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

జెండా మోసిన కార్యకర్తను మరవొద్దు: బీకే పార్థసారథి, ఎంపీ



పార్టీ అధికారంలోకి వచ్చేందుకు జెండా మోసి, బెదింపులు, కేసులకు బెదరకుండా నిలబడిన నాయకులు, కార్యకర్తలను మరవొద్దు. ఈరోజు మనం ఇక్కడ కూర్చున్నామంటే కార్యకర్త వల్లే. అధికారంలో ఉన్నప్పుడు కార్యకర్తలను విస్మరించకూడదు. ఎన్టీఆర్ అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి, రాజ్యాధికారం ఇచ్చారు. టీడీపీకి ఓచరిత్ర ఉంది. పార్టీ కోసం ఎవరెవరు కష్టపడి పనిచేశారో వారికి సముచిత గౌరవం ఇవ్వాలి. ఎన్టీఆర్ స్ఫూర్తితో సీఎం చంద్రబాబు జిల్లాను అగ్రపథంలోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారు.

కార్యకర్తలకు అండగా ఉండాలి: పరిటాల సునీత, రాప్తాడు ఎమ్మెల్యే



మనం అధికారంలోకి వచ్చి ఏడాదైంది. ఇంకా కొంత మంది పోలీసులు వైసీపీ ముసుగు వేసుకుని పని చేస్తున్నారు. నేటికి టీడీపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోవాలి. జెండా మోసిన టీడీపీ కార్యకర్తలకు అండగా ఉండాల్సిన అవసరం ఉంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పార్టీ కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. బడుగు, బలహీన వర్గాల్లో రాజకీయ చైతన్యం తెచ్చిన పార్టీ టీడీపీ. ఎంతో మందికి రాజకీయ భిక్షపెట్టింది టీడీపీయే. గత ఐదేళ్లుగా ధర్మవరంలో పార్టీ కోసం పరిటాల శ్రీరామ్ ఎంతో కష్టపడి పనిచేస్తున్నారు. ఎంత కష్టం వచ్చిన పార్టీ కార్యకర్తల వెన్నంటే ఉంటాం.

కార్యకర్తల వెన్నంటి ఉంటాం: పల్లె సింధూరారెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే



ప్రజలే దేవుళ్లు సమాజమే దేవాలయం అన్న నినాదంతో దివంగత ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం. పార్టీ అధికారంలోకి రావడానికి అహర్నిశలు కృషి చేసిన కార్యకర్తలను కాపాడుకుంటాం. చంద్రబాబు నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు దీటుగా ముందుకు వెళుతోంది. వైసీపీ పాలనలో టీడీపీ నేతలు, కార్యకర్తలపై పెట్టిన కేసులను ఎత్తివేయించేందుకు కృషి చేస్తాం. కార్యకర్తల వెన్నంటి ఉంటాం.

ఏ పార్టీకి లేనంత కార్యకర్తల బలం: కందికుంట వెంకటప్రసాద్, కదిరి ఎమ్మెల్యే



ప్రపంచ చరిత్రలో ఏరాజకీయ పార్టీకి లేనంత కార్యకర్తల బలమున్నా పార్టీ టీడీపీనే. కొన్ని కుటుంబాలు, వర్గాలకు మాత్రమే పరిమితమైన రాజ్యాధికారాన్ని బడుగు, బలహీన వర్గాలకు అందించిన ఘనత దివంగత ఎన్టీఆర్‌కే దక్కుతుంది. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా పార్టీ నిలబడగలిగింది అంటే కార్యకర్తల వల్లే. పొద్దు తిరుగుడు పువ్వుల పట్ల జాగ్రత్తగా ఉండాలి. జెండా మోసిన కార్యకర్తలను గౌరవంతో కాపాడుకోవాలి. ఏమాత్రం రాజకీయ నేపథ్యం లేని కుటుంబం నుంచి వచ్చిన నన్ను సంక్షోభాల్లో కూడా కాపాడింది టీడీపీ కార్యకర్తలే.



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

తీర్మానాలు

హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు రావడంపై జిల్లా స్థాయి మినీమహానాడు అభినందన తీర్మానం పెట్టారు. సాగు, తాగునీరు, హంద్రీనీవా జలాలు, జిల్లా పారిశ్రామిక అభివృద్ధి, రహదారులు, మౌలిక సదుపాయాలు, యువతకు ఉద్యోగం, ఉపాధి కల్పన, కార్యకర్తల సంక్షేమం, నూతన ఎన్టీయార్ కాలనీల ఏర్పాటు, టిడ్కో ఇళ్ల పూర్తి, అన్ని నియోజకవర్గాల్లో పారిశ్రామిక అభివృద్ధి, సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించడం, 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి కూలీల పని దినాలు 100 రోజుల నుండి 150 రోజులకు పెంపు, జగనన్న కాలనీల పేర్లు మార్పు, గుడిపల్లి రిజర్వాయర్ అభివృద్ధి, పుట్టపర్తి నియోజకవర్గంలో 193 చెరువులు నీరు నింపే పేరూరు ప్రాజెక్టు త్వరగా చేయడం, బీసీలకు మహాత్మాజ్యోతిరావుపూలే రెసిడెన్షియల్ స్కూల్ అదనంగా ఇవ్వాలి, ప్రతి నియోజకవర్గంలో చేనేత క్లస్టర్ ఏర్పాటు, జిల్లాకేంద్రంలో అధికారుల కార్యాలయాలు కొరకు స్థల సేకరణ, భవనాల నిర్మాణం, టీడీపీ కార్యాలయం నిర్మాణం కొరకు స్థలం, పుట్టపర్తి కొత్తచెరువు, బుక్కపట్నం మూడు మండలాలను కలిపేలా రింగ్‌రోడ్ నిర్మాణం, బుక్కపట్నం చెరువులో ముంపుభూములకు పరిహారం చెల్లించాలి. హంద్రీనీవా కాలువ భూముల పరిహారం 9వ ప్యాకేజీ పెద్దకమ్మవారిపల్లి భూములకు పరిహారం చెల్లించాలి, రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలపై పెట్టిన కేసుల ఎత్తివేయడం, అమరజవాన్ మురళీనాయక్ పేరును కళ్లితండాకు పెట్టడం, బీసీ, ఎస్సీ ఎస్టీ మైనారిటీలకు విరివిగా సబ్సిడీ రుణాలు మంజూరు చేసేలా పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానం చేశారు.

తెలుగు నేల ఉన్నంత కాలం: ఎంఎస్ రాజు, ఎమ్మెల్యే మడకశిర



తెలుగు నేల, జాతి ఉన్నంత కాలం తెలుగుదేశం పార్టీ తెలుగు ప్రజల గుండెల్లో ఉంటుంది. కార్యకర్తల అండతోనే పార్టీ నాలుగు దశాబ్దాల పైబడిన ప్రస్థానాన్ని కొనసాగించింది. అన్ని వర్గాలను రాజ్యాధికారంలో భాగస్వాములను చేసిన ఘనత టీడీపీదే. మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఫొటో చూసి భయపడుతున్నారని కొంత మంది జఫ్ఫాగాళ్లు వైసీపీ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే పులివెందుల గడ్డపై సైకోపోవాలి.. సైకిల్ రావాలంటూ నినదించిన దమ్మున్న కార్యకర్తలు గల పార్టీ టీడీపీ. కష్టకాలంలో పసుపు జెండా మోస్తూ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన ప్రతి కార్యకర్తను కాపాడుకుంటాం.

గుండెల్లో పెట్టుకుంటాం: కొల్లకుంట అంజినప్ప, టీడీపీ జిల్లా అధ్యక్షుడు



గత ఐదేళ్ల దుర్మార్గ పాలనపై పోరాటం చేసి, పార్టీని అధికారంలోకి తెచ్చిన ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుంటాం. ఈరోజు జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలతోపాటు పార్లమెంట్‌లో క్లీన్ స్వీప్ చేశామంటే కార్యకర్తల కృషి వల్లే. ఐదు లక్షల పసుపు సైనికుల వల్లే జిల్లా, గ్రామ స్థాయిలో పార్టీ పటిష్టమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ వల్లే జిల్లా పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో దూసుకెళ్తోంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేలా సన్నద్ధమవుదాం.

కార్యకర్తల త్యాగ ఫలితమే అధికారం: పల్లె రఘునాథరెడ్డి. మాజీ మంత్రి



కార్యకర్తల త్యాగ ఫలితంగానే కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. యువగళం పాదయాత్రతో యువకుల్లో ఆత్మస్థైర్యం నింపి, వైసీపీ నాయకుల గుండెల్లో భయం నింపిన నాయకుడు లోకేశ్. కోటిమందికి పైగా పార్టీ సభ్యత్వం కలిగిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ. మరో 30 సంవత్సరాలు తెలుగుదేశంపార్టీ అధికారంలో ఉండాలి. ఎమ్మెల్యే సింధూరారెడ్డి చొరవతో సత్యసాయి శత జయంతి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా గుర్తించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ధన్యవాదాలు. నియోజకవర్గంలో 193 చెరువులను నింపి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తాం.

కట్టె కాలేవరకు.. పరిటాల శ్రీరామ్



కట్టెకాలే వరకు పచ్చకండువా నామెడలోనే ఉంటుంది. పరిటాల రవిని ఆరోజు ఎన్టీఆర్ ఏవిధంగా పచ్చ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించాలో అలాగే నాకు నందమూరి బాలకృష్ణ మొట్టమొదటి సారిగా కండువా వేసి ఆహ్వానించారు. బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు వచ్చిన నేపథ్యంలో అభినందలు తెలుపుతూ పెట్టిన తీర్మానం బలపరిచే అవకాశం నాకు దక్కడం చాలా సంతోషంగా ఉంది.

నిబద్ధతతో పని చేద్దాం: గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్సీ



పార్టీని స్థాపించిన 9 నెలల్లోనే అధికారంలోకి తెచ్చిన ఘనత దివంగత ఎన్టీఆర్‌కే దక్కుతుంది. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం ఆయన శ్రమించారు. ప్రజలే దేవుళ్లు సమాజమే దేవాలయం అన్న నినాదంతో ఆవిర్భవించిన పార్టీలో మనమందరం నిబద్ధతతో రాష్ట్రాభివృద్ధి కోసం పనిచేద్దాం.

కార్యకర్తలే కొండంత అండ: నిమ్మల కిష్టప్ప, మాజీ ఎంపీ



తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే కొండంత అండ. వైసీపీ దుర్మార్గ పాలన అంతమొందించడంలో కార్యకర్తల పోరాటం అద్భుతం. రాష్ట్ర శాసనసభలో వైసీపీ నాయకుల నీచమైన మాటలకు ఆవేదన చెంది ముఖ్యమంత్రిగానే శాసనసభలో అడుగుపెడతానని చంద్రబాబు చేసిన శపథాన్ని నెరవేరడానికి కార్యకర్తలు చేసిన పోరాటమే కారణము.

పల్లె భావోద్వేగం



మినీ మహానాడులో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. మినీ మహానాడు వేదికపై పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ప్రసంగిస్తూ తమది చిన్నకుటుంబం అయితే తన మామయ్య పల్లె రఘునాథరెడ్డి మంచితనంతో ఇంత మంది కార్యకర్తలు గల నియోజకవర్గాన్ని కుటుంబంగా తనకు ఇచ్చారన్నారు. ఆయన 30 ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలకు చేసిన సేవను గుర్తించే పుట్టపర్తి ఎమ్మెల్యేగా తనను గెలిపించారని, ఈ సందర్భంగా పల్లె రఘునాథరెడ్డికి శిరస్సు వంచి వందనాలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. ఈక్రమంలో వేదికపై ఉన్న పల్లె రఘునాథరెడ్డి భావోద్వేగానికి గురై కంట తడిపెట్టారు. వేదిక ఉన్న నాయకులు, సభకు వచ్చిన పార్టీ శ్రేణులు కాసేపు పల్లెను చూచి భావోద్వేగానికి గురయ్యారు.

వేధించిన సీఐకి ప్రాధాన్యమా..?

మంత్రి పయ్యావులను పరోక్షంగా ప్రశ్నించిన టీడీపీ నాయకుడు

పుట్టపర్తి రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో టీడీపీ నాయకులను, కార్యకర్తలను తీవ్ర ఇబ్బందులు పెట్టిన సీఐకి ప్రాధాన్యం ఇవ్వడం ఏమిటని మంత్రి పయ్యావుల కేశవ్‌ను టీడీపీ శ్రీసత్యసాయి జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేసు ప్రశ్నించారు. పుట్టపర్తిలో శనివారం జరిగిన పార్టీ జిల్లా మినీ మహానాడులో ఆయన ప్రసంగించారు. అనంతపురం జిల్లా మినీ మహానాడులో 'పొద్దుతిరుగుడు పూల తరహాలో వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీలోకి వస్తున్నారు. వారికి ప్రాధాన్యం ఇచ్చేది లేదు' అని మంత్రి అన్నారని గుర్తు చేశారు. కానీ వైసీపీ హయాంలో రాప్తాడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను, నాయకులను నానా ఇబ్బందులకు గురిచేసిన ఓ సీఐకి ఉరవకొండ నియోజకవర్గంలోనే మంత్రి



మినీ మహానాడులో మాట్లాడుతున్న దండు ఓబులేసు

పోస్టింగ్ ఇప్పించారని, ఇదేమి న్యాయం సార్ అని ఓబులేసు ప్రశ్నించారు. ఆ సీఐ రాప్తాడు నియోజకవర్గంలో టీడీపీ నాయకులతో పాటు అప్పటి టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథిని కూడా బెదిరించి, బూతులు తిట్టిన విషయాన్ని మీరు మరిచిపోయారా? అని ప్రశ్నించారు. మంత్రి ఇలా వ్యవహరించడం తగదని ఓబులేసు అన్నారు.

రైతన్నకు విపత్తు..?

సబ్సిడీ విత్తన వేరుశనగ నాణ్యతపై సందేహాలు

ఎక్కడి నుంచి సేకరించారన్న సమాచారం నిల్

ఇష్టారాజ్యంగా కొన్ని ఏజెన్సీల సేకరణ

ఈ ఏడాది ఆలస్యంగా ప్రాసెసింగ్ మొదలు

అదునుకు విత్తనం అందేనా..?



ప్రాసెసింగ్ చేసిన విత్తన వేరుశనగ కాయలు

అనంతపురం అర్బన్/బెళుగుప్ప, మే 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పంపిణీ చేసే సబ్సిడీ విత్తన వేరుశనగ నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి విత్తన ప్రాసెసింగ్ ప్రక్రియ ఆలస్యమైంది. గతంలో మే నెలారంభం నుంచే విత్తన ప్రాసెసింగ్‌ను మొదలు పెట్టేవారు. ఈ సారి గత రెండు రోజుల కిందటి నుంచి విత్తన వేరుశనగ ప్రాసెసింగ్ పనులు ఆరంభించారు. ఖరీఫ్ సీజన్ ఆరంభానికి మరో వారం రోజులే సమయం ఉంది. ఈ సారి నైరుతి రుతుపవనాలు ముందస్తుగానే జిల్లాలోకి ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో దుక్కులు పూర్తి చేసుకున్నారు. మరో సారి వర్షం పడితే సీజన్ ఆరంభంలోనే విత్తనం వేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఈనెలాఖరులోగా మండలాలకు విత్తన కాయలు సరఫరా చేయాలని వ్యవసాయ ఉన్నతాధికారులు ఆదేశించారు. సమయం తక్కువగా ఉండటంతో విత్తన ప్రాసెసింగ్ ఆశించిన స్థాయిలో జరిగే పరిస్థితులు లేవనే వాదనలు వినిపిస్తున్నాయి. దీని ప్రభావం విత్తన నాణ్యతపై పడే అవకాశం ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు కొన్ని ఏజెన్సీలు నాసిరకం విత్తన కాయలు సేకరించారన్న విమర్శలున్నాయి. సబ్సిడీ విత్తన సేకరణ విధానంలో మార్పులు చేయడంతోనే ఈ సమస్య తలెత్తిందన్న వాదనలున్నాయి.

గతంలో సర్టిఫైడ్ సీడ్ సరఫరా

గతంలో సర్టిఫైడ్ సీడ్‌ను సరఫరా చేసేవారు. ఈ పద్ధతిలో విత్తన వేరుశనగ సరఫరా సమయంలో విత్తన సేకరణ సంస్థలు సేకరించిన విత్తనం నాణ్యంగా ఉందా? లేదా అన్న విషయాన్ని విత్తన ధ్రువీకరణ సంస్థ అధికారులు పరిశీలించి, ట్యాగ్ వేసేవారు. ఏఏ రైతుల నుంచి వేరుశనగ సేకరించారన్న జాబితాను విత్తన సేకరణ సంస్థలు విత్తన ధ్రువీకరణ సంస్థ అధికారులకు అందించేవారు. అప్పట్లో మూల విత్తనాన్ని రైతులకు అందించి బోరుబావుల కింద పంట పండించేవారు. ఆయా రైతులు పండించిన వేరుశనగ పంటను తిరిగి కొనుగోలు చేసేవారు. మూల విత్తనంతో సాగు చేసిన పంటను పలు దశల్లో విత్తన ధ్రువీకరణ సంస్థ అధికారులు పర్యవేక్షించేవారు. పంట కాలంలో పాటించాల్సిన సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారా..? కాయ నాణ్యత వచ్చేందుకు పాటించాల్సిన పద్ధతులపై పంట కాలంలో దశల వారిగా పర్యవేక్షించేవారు. అన్ని సవ్యంగా ఉంటేనే ఆయా రైతుల నుంచి విత్తన వేరుశనగను సేకరించేవారు.

సొంత ధ్రువీకరణ పద్ధతితో గందరగోళం

సొంత ధ్రువీకరణ (టీఎల్) పద్ధతిలో విత్తన వేరుశనగ సేకరణ గందరగోళంగా మారింది. ఈ విధానంలో ఏజెన్సీలకే విత్తన సేకరణపై స్వేచ్ఛను ఇచ్చారు. కొన్ని సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా విత్తనం సేకరించినట్లు తెలిసింది. రబీ సీజన్‌లో బోరుబావుల కింద పండించిన పంటలో నాణ్యమైన విత్తన కాయలను సేకరించాల్సి ఉంది. కొన్ని సంస్థలు అందుకు విరుద్ధంగా వ్యాపారుల నుంచి, మరికొందరు ఖరీఫ్‌లో వర్షాధారం కింద పండించిన పంటను సేకరిస్తున్నారన్న విమర్శలున్నాయి.
ఆ విత్తనాన్ని ప్రాసెసింగ్ చేసి బస్తాల్లో నింపుతున్న ట్లు సమాచారం. ఇవి చూసేందుకు బాగానే ఉన్నా, మొలకశాతం తక్కువగా రావడం, నాణ్యత, మంచి దిగుబడి రాకపోవడంతో రైతులు నష్టపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రతి ఏడాది ఇదే తంతు కొనసాగుతోంది. గత ఐదేళ్లల్లో నాసిరకం విత్తన నాయలను పలు మండలాల్లో ఏఓలు తిరస్కరించి వెనక్కి పంపారు. మరికొన్ని మండలాల్లో ప్రలోభాలకు తలొగ్గి మిన్నకుండిపోయిన సంఘటనలు ఉన్నాయి. ఈ సారి పలు ప్రాంతాల్లో అదే పరిస్థితులు కొనసాగించేందుకు సిద్ధమయ్యారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

సమీపిస్తున్న ఖరీఫ్.. ఆందోళనలో అన్నదాతలు

ఈ ఏడాది అనంత జిల్లాకు 50592 క్వింటాళ్లు, శ్రీసత్యసాయి జిల్లాకు 63వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ కేటాయించారు. ఖరీఫ్ సీజన్ సమీపిస్తోంది. అయితే ఇప్పటి దాకా మండలాలకు విత్తన కాయలు చేరకపోవడంతో ఎప్పటి నుంచి విత్తన పంపిణీ ప్రారంభిస్తారంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు.



బెళుగుప్ప ఏజెన్సీలో విత్తన వేరుశనగను ప్రాసెసింగ్ చేస్తున్న దృశ్యం

గత ఏడాది ఏప్రిల్ ఆఖరు వారంలోనే విత్తన సరఫరా, ధరలు ఖరారు చేయడంతో మే 1 నుంచి విత్తన వేరుశనగ ప్రాసెసింగ్ పనులు మొదలు పెట్టారు. మే 18 నుంచి రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైంది. మే మూడో వారం నుంచే విత్తన వేరుశనగ పంపిణీ మొదలు పెట్టారు. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో 15 విత్తన సేకరణ ఏజెన్సీలకు (అనంత జిల్లాలో 12 ఏజెన్సీలు, శ్రీ సత్యసాయి జిల్లాలో 3 ఏజెన్సీలు) విత్తన వేరుశనగ సరఫరా బాధ్యతలు అప్పగించారు.
గత ఏడాది విత్తన సరఫరాకు సంబంధించిన బకాయిలు ఉండటంతో ఇప్పటి వరకు ప్రాసెసింగ్ మొదలు పెట్టలేదు. తాజాగా కొంత బకాయిలు చెల్లించడంతో రెండు రోజుల నుంచి విత్తన వేరుశనగ ప్రాసెసింగ్ పనులు మొదలుపెట్టారు. ఉమ్మడి జిల్లాకు 1.13 లక్షల క్వింటాళ్ల విత్తన వేరుశనగ సరఫరా చేయాల్సి ఉంది. విత్తన పంపిణీ మొదలు పెట్టాలంటే ఆయా రైతు సేవా కేంద్రాలకు కేటాయించిన మొత్తంలో సగం కాయలు సరఫరా చేయాల్సి ఉంటుంది. గత రెండు రోజులుగా 3వేల క్వింటాళ్ల విత్తనాన్ని ప్రాసెసింగ్ చేశారు. ఈ లెక్కన ఎప్పటిలోగా క్షేత్ర స్థాయికి పూర్తి స్థాయిలో విత్తన కాయలు పంపుతారోనన్న సందిగ్ధత నెలకొంది.

నాణ్యమైన విత్తన కాయల సరఫరాకు చర్యలు



ఏజెన్సీలు నాణ్యమైన విత్తన వేరుశనగ కాయలను సరఫరా చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. అందుకోసమే ఒక్కో ప్రాసెసింగ్ యూనిట్‌కు ఒక ఏఓను పర్యవేక్షణాధికారిగా నియమించాం. ముందస్తు ప్రణాళికల మేరకు నిర్దేశించిన మోతాదులో రైతు సేవా కేంద్రాలకు విత్తన కాయలు సరఫరా చేస్తాం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు త్వరలోనే విత్తన పంపిణీ తేదీని ప్రకటిస్తాం.

\- ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి

ఎడ తెగని బదిలీ సమస్యలు...!

క్యూ కడుతున్న టీచర్లు, సంఘాల నేతలు

సీనియారిటీ జాబితాపై స్పష్టత ఇవ్వని అధికారులు

డీఈఓల మధ్య కొరవడిన సమన్వయం

శ్రీసత్యసాయి అధికారుల పాత్ర నామమాత్రం


అనంతపురం విద్య, మే 24(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల్లో సమస్యలు తెగడం లేదు. సీనియారిటీ, స్కూలులో పోస్టులు పోవడం, బదిలీలకు దరఖాస్తు చేసేటప్పుడు ఎదురయ్యే సాంకేతిక ఇబ్బందులు.. ఇలా సమస్యలు కోకోల్లలు. ఫలితంగా ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు కార్యాలయానికి పోటెత్తుతున్నారు. ఎడతెగని బదిలీల సమస్యలతో ఉపాధ్యాయులు సతమతమవుతున్నారు. ఉమ్మడి జిల్లా విద్యాశాఖాధికారుల మధ్య సమన్వయం లేకపోవడం.. ముఖ్యంగా సత్యసాయి జిల్లా అధికారులు నామమాత్రపు పాత్ర పోషిస్తుండటంతో బదిలీలు, పదోన్నతుల్లో ఎదురయ్యే సమస్యలతో టీచర్ల గగ్గోలు పెడుతున్నారు.

కొరవడిన సమన్వయం

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు రెండు జిల్లాలకు అనంతపురం జిల్లా వేదికగా నిర్వహిస్తున్నారు. సుమారు 15వేల మంది టీచర్లు ఉన్నారు. బదిలీలు, ప్రమోషన్ల సన్నద్ధత ప్రక్రియ ఈనెల మొదటి వారంలోనే మొదలైంది. అనంతపురం, సత్యసాయి జిల్లా విద్యాశాఖాధికారులు, ఏడీలు, సూపరింటెండెంట్లు, రెండు జిల్లాల ఐటీ సెల్ సభ్యులు, ఇతర సిబ్బంది సమన్వయంతో పూర్తి చేయాల్సి ఉంది. అనంతపురం జిల్లా ఐటీ సెల్, ఇతర సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటున్నారు. అనంత జిల్లా డీఈఓ, సిబ్బంది భాగస్వామ్యం ఉన్నట్టుగా సత్యసాయి జిల్లా విద్యాశాఖాధికారుల పాత్ర కనిపించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఆ జిల్లా డీఈఓ, ఏడీలు, సిబ్బంది చుట్టపుచూపుగా ప్రత్యక్షమవుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. సత్యసాయి జిల్లా ఐటీ సెల్ సిబ్బంది, ముగ్గురు లేదా నలుగురు క్లర్కులు మినహా ఇతరుల పాత్ర కనిపించలేదని ఉపాధ్యాయులు, సంఘాల నేతల నుంచి వినిపిస్తోంది. ఆదేవిధంగా బదిలీలు, ప్రమోషన్ల కోసం వేసిన టీమ్స్‌లో ఉన్న టీచర్లు సైతం చుట్టపుచూపుగా వచ్చి వెళ్తున్నారు. మరికొందరు అక్కడ కనిపించడం లేదు.

సమస్యలకు బదులిచ్చేవారేరీ...?

బదిలీలు, ప్రమోషన్ల వేళ టీచర్లు సమస్యలతో కొట్టుమిట్టాడుతూనే ఉన్నారు. అధికారుల సమన్వయం చేసుకోకపోవడంతో ఉపాధ్యాయులు, సంఘాల నేతల ఇచ్చే వినతులు, గ్రీవెన్సులు ఎక్కడివక్కడే మూలుగుతున్నాయి. బదిలీల వేళ సాంకేతిక సమస్యలు కూడా టీచర్లను వెంటాడుతున్నాయి. వాటిపై స్పష్టత ఇచ్చేవారు లేరు. ఎస్‌జీటీగా పనిచేస్తూ...తర్వాత డీఎస్సీల్లో స్కూల్ అసిస్టెంట్‌గా నియమితుయిన టీచర్లకు.. ఎస్‌జీటీ పాయింట్లు కాకుండా ఎస్ఏ పాయింట్లు పరిగణనలోకి తీసుకుంటున్నారని వాపోతున్నారు. 40 సంవత్సరాలు పైబడిన అవివాహిత టీచర్లకు 5 పాయింట్లు జత కావడం లేదని బాధితులు గగ్గోలు పెడుతున్నారు. 2023లో బదిలీ అయి.. ఈ ఏడాది రేషనలైజేషన్‌లో పోస్టు పోయే టీచర్లకు.. 2023లో పొందిన స్టేషన్ పాయింట్లు, ప్రస్తుత రేషనలైజేషన్ స్టేషన్ పాయింట్లు కూడా జత చేస్తున్నారని, 9,10 ఏళ్లు పనిచేసిన వాళ్లకు సీలింగ్ పేరుతో స్టేషన్ పాయింట్లు తొలగిస్తుండటంపై కొందరు టీచర్లు భగ్గుమంటున్నారు. లాంగ్వేజ్ పండిట్స్ తెలుగు, హిందీ, పీఈటీలు 2019లో ఎస్ఏగా ప్రమోషన్ పొంది....రెండుసార్లు రేషనలైజేషన్ ప్రభావానికి గురయిన టీచర్లకు 7 పాయింట్లు కాకుండా 5 పాయింట్లు వస్తున్నాయని వాపోతున్నారు. జిల్లాలో 46 మంది వరకూ పీఈటీలు ఉన్నామని, బదిలీకి దరఖాస్తు చేసుకోవాలా వద్దా.. చెప్పేవారు లేరని వారు వాపోతున్నారు. ఇలా అనేక సందేహాలకు, సమస్యలకు బదులిచ్చేవారు లేరు. ఉమ్మడి జిల్లాల విద్యాశాఖాధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో సమస్యలు, సందేహాలు పరిష్కారం కాలేదంటూ టీచర్లు, సంఘాల నేతలు గగ్గోలు పెడుతున్నారు.



వినతులు స్వీకరిస్తున్న విద్యాశాఖాధికారులు

క్రైం కార్నర్

ఎన్‌ఎస్‌యూఐ నాయకుడి హత్యకేసు.. మరొకరి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మహేష్, సీఐలు

హిందూపురం, మే 24(ఆంధ్రజ్యోతి): ఎన్‌ఎస్‌యూఐ నాయకుడు, న్యాయవాది అయిన సంపత్‌కుమార్ హత్యకేసులో నిందితుడైన కేసీ నాగార్జునరెడ్డిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ మహేష్ తెలిపారు. వివరాలను శనివారం హిందూపురంలోని డీఎస్పీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో వెల్లడించారు. హిందూపురంలో నివాసమున్న న్యాయవాది కేసీ కృష్ణారెడ్డికి ఇంటివద్ద స్థలం విషయంలో మేళాపురానికి చెందిన శ్రీకాంత్‌తో గొడవలు జరిగాయి. ఆబాద్‌పేటలో నివాసమున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకుడు, న్యాయవాది అయిన సంపత్‌కుమార్ తన స్నేహితుడైన శ్రీకాంత్‌కు అండగా నిలిచాడు. ఈక్రమంలో కేసీ కృష్ణారెడ్డి, సంపత్‌కుమార్‌లు ఒకరిపై ఒకరు కేసులు కూడా పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో సంపత్‌కుమార్ అడ్డు తొలగించుకోవాలని కుట్ర పన్నారు. దీంతో గత ఏడాది మే 29న రాత్రి మంచి మాటలతో కొటిపి సమీపంలోని చింతలపల్లికి వెళ్లే దారిలో పక్కకు సంపత్‌కుమార్‌ను తీసుకెళ్లారు. అక్కడ అతడికి మద్యం తాపించి కొడవలి, బాకుతో దాడిచేశారు. పగిలిన బీరుబాటిల్ సీసాలతో పొడిచి హత్యచేశారు. ఆ తరువాత మృతదేహాన్ని కారులో తీసుకెళ్లి ధర్మవరం సమీపంలోని చెరువు మరువ వద్ద పడేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి తొమ్మిది మందిపై కేసు నమోదు చేశారు. ఇందులో ఐదుగురిని అరెస్ట్‌చేయగా మరో నలుగురు పరారీలో ఉన్నారు. ఇందులో ఏ-2గా ఉన్న కేసీ నాగార్జునరెడ్డిని శనివారం తెల్లవారుజాము సమయంలో కర్ణాటకలోని దేవనహళ్లి వద్ద ఓ రిసార్ట్‌లో అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఏ-1గా ఉన్న న్యాయవాది కేసీ కృష్ణారెడ్డితోపాటు మరో ఇద్దరు పరారీలో ఉన్నారన్నారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన అప్‌గ్రేడ్ సీఐ రాజగోపాల్ నాయుడు, అంజనేయులు, అబ్దుల్‌కరీం, ఎస్‌ఐలు మునిప్రతాప్, మునీర్ అహ్మద్, నరేంద్రలను ప్రత్యేక బృందాన్ని డీఎస్పీ అభినందించారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



ధర్మవరం, మే 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుర్గమ్మగుడి పెట్రోల్ బంక్ ఎదురుగా బస్టాప్‌లో ఓ గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందాడని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు 60 సంవత్సరాలు ఉంటుందని, ఆచూకీ తెలిసిన వారు 94948 16259 నెంబర్‌కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

వీఆర్‌ఓకు లంచం

● పని చేయలేదని డిప్యూటి తహసీల్దారుకు రైతు ఫిర్యాదు

కూడేరు, మే 24, (ఆంధ్రజ్యోతి): భూ సమస్య పరిష్కారం కోసం వీఆర్‌ఓ బండారు శంకరనారాయణకు రూ. లక్ష లంచం ఇచ్చినట్లు మండలంలోని కల్లగళ్ల గ్రామానికి చెందిన రైతు ఎర్రిస్వామి డిప్యూటీ తహసీల్దారుకు శనివారం ఫిర్యాదు చేశాడు. తాను సాగు చేస్తున్న భూమికి సాగు అనుమతులు ఇస్తానని చెప్పడంతో లంచం ఇచ్చినట్లు వాపోయాడు. గత కొన్నేళ్లుగా సాగు చేస్తున్న భూమి పెండింగ్‌లో ఉండటంతో లంచం ఇస్తే సాగు అనుమతులు ఇప్పిస్తానని వీఆర్‌ఓ చెప్పడంతో నగదు ఇచ్చినట్లు పేర్కొన్నాడు. లంచం తీసుకొని కూడా భూమి సమస్య పరిష్కరించలేదని రైతు వీఆర్‌ఓతో వాగ్వాదానికి దిగాడు. తనకు న్యాయం చేసి సంబంధిత వీఆర్‌ఓపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దారు సూర్యప్రతాప్‌కు వినతిపత్రం అందజేశారు.

● ఈ ఆరోపణలపై వీఆర్‌ఓను వివరణ అడగ్గా తాను రైతుతో డబ్బు అప్పుగా తీసుకున్నట్లు తెలిపారు. వివిధ సందర్భాల్లో రూ.40 వేలు అప్పుగా తీసుకున్నట్లు పేర్కొన్నారు.

రాజస్థాని వ్యాపారిపై స్థానిక వ్యాపారుల దాడి

కళ్యాణదుర్గం, మే 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కంబదూరు బైపాస్‌లో ఇనుప కడ్డీల దుకాణం ఏర్పాటు చేసుకున్న రాజస్థాని వ్యాపారి జితేందర్‌పై స్థానిక వ్యాపారులు దాడి చేశారు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి చోటుకుంది. బాధితుడు, పోలీసులు తెలిపిన మేరకు.. రాజస్థాన్‌కు చెందిన జితేందర్ 2020లో ఇనుప కడ్డీల వ్యాపారం ప్రారంభించారు. కొంత తక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. దీనిని జీర్ణించుకోలేక పట్టణానికి చెందిన ఇనుప కడ్డీల వ్యాపారులు రేవన్న, అతడి కుమారుడు దివాకర్, మరికొందరు మొదటి నుంచి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పది రోజుల కిందట దుకాణం వద్దకు వచ్చి దాడి చేశారని బాధితుడు వాపోయారు. పలువురు వ్యాపారులతో కలిసి మరోసారి శుక్రవారం దుకాణం వద్దకు వచ్చారన్నారు. సీసీ కెమెరాలు ఆఫ్ చేసి గొడవ పడ్డారని, ఖాళీ చేసి ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని బెదిరించారని తెలిపారు. అక్కడే ఉన్న రంగుల డబ్బాలు, చేతికి దొరికిన వాటితో దాడి చేయగా పరుగులు తీసినట్లు వాపోయారు. ఒక కిలోమీటర్ వరకు ద్విచక్రవాహనంపై వెంటాడి విచక్షణా రహితంగా దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తమపై కూడా దాడి చేశారంటూ రేవన్న, దివాకర్ ఆసుపత్రిలో చేరారు. ఈ విషయమై టౌన్ సీఐ యువరాజును వివరణ కోరగా.. రాజస్థాన్ వ్యాపారి జితేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మరణమే శరణమా..?

ఉమ్మడి జిల్లాలో ఆరుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు. వీరిలో ఒకరు నాలుగు రోజుల క్రితమే ఉరి వేసుకోగా.. శనివారం వెలుగులోకి వచ్చింది. మిగిలిన ఐదుగురు ఒకే రోజు ఆత్మహత్య చేసుకున్నారు. అప్పుల బాధతో ఓ రైతు, అనారోగ్యంతో మరో రైతు, సెల్‌ఫోన్ కోసం విద్యార్థి, ఒంటరి జీవితం వద్దనుకుని ఓ మహిళ, ఓ పురుషుడు, ఇంట్లోవారితో గొడవపడి యువకుడు.. ఇలా ఎవరికివారు జీవితాన్ని వద్దనుకున్నారు. లోకాన్నివీడి శాశ్వతంగా వెళ్లిపోయారు.

- న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి

● ఉమ్మడి జిల్లాలో ఆరుగురి ఆత్మహత్య
● అప్పుల బాధతో అన్నదాత
● సెల్‌ఫోన్ కొనివ్వలేదని విద్యార్థి..
● ఒంటరి జీవితం వద్దనుకుని ఇద్దరు..
● అనారోగ్యంతో ఒకరు..
● ఇంట్లోవారితో గొడవపడి మరొకరు..

అప్పుల బాధతో రైతు..



కురుబ మంజు (ఫైల్)

బెళుగుప్పకు చెందిన రైతు కురుబ మంజు(44) అప్పుల బాధతో ఉరివేసుకున్నాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంజు ఈ నెల 21న ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో వారి ఇంటి సమీపంలోని ఖాళీ ఇంటి నుంచి శనివారం దుర్వాసన రావడంతో వెళ్లి చూశారు. ఆ ఇంటి స్నానపు గదిలో మంజు ఉరి వేసుకున్నట్లు గుర్తించారు. మంజుకు ఏడు ఎకరాల పొలం ఉంది. దీనికితోడు తన సోదరులు, ఇతరుల భూములను కౌలుకు తీసుకుని వేరుశనగ సాగు చేసేవాడు. రెండు మూడేళ్ల నుంచి సరైన దిగుబడి రాక నష్టపోయాడు. అప్పులు, వడ్డీలు రూ.30 లక్షలకు చేరాయి. రుణదాతల నుంచి ఒత్తిళ్లు పెరిగాయి. దిక్కుతోచక ఆత్మహత్య చేసుకున్నాడు. రైతుకు భార్య పద్మావతి, ముగ్గురు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయి భార్య, పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత కుటుంబం కోరింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని బెళుగుప్ప ఎస్‌ఐ శివ తెలిపారు.

సెల్‌ఫోన్ కోసం విద్యార్థి..



శ్రీనివాసులు(ఫైల్)

తల్లిదండ్రులు సెల్‌ఫోన్ కొనివ్వలేదని ఇంటర్ విద్యార్థి వడ్డె శ్రీనివాసులు(18) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. గుంతకల్లు పట్టణంలోని కొనకొండ్ల రైల్వే గేట్ సమీపంలో నాగభూషణం, మమత దంపతుల కుటుంబం నివసిస్తోంది. వీరి కుమారుడు శ్రీనివాసులు పదో తరగతి పాసై.. రెండు రోజుల క్రితం స్థానిక శ్రీ శంకరానందగిరి స్వామి జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరాడు. తన స్నేహితుడి పాత సెల్‌ఫోన్‌ను తెచ్చుకుని వాడుకునేవాడు. ఆ ఫోన్‌ను తిరిగి ఇచ్చేయాలని, సిమ్ కార్డు తీసేయాలని శ్రీనివాసులుకు తండ్రి సూచించాడు. ఇతరుల ఫోన్ వాడటం మంచిది కాదని మందలించాడు. తాను కొత్త ఫోన్ కొనిస్తానని సూచించాడు. కానీ వెంటనే కొనివ్వనందుకు మనస్తాపం చెందిన శ్రీనివాసులు, బహిర్భూమికి వెళ్లి హనుమాన్ సర్కిల్ రైల్వే స్టేషన్ సమీపంలో తిరుపతి ప్యాసింజర్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. జీఆర్పీ ఎస్‌ఐ మహేంద్ర సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఒంటరి జీవితం వద్దనుకుని...

● గుడిబండ మండలం జీఎస్ తండాకు చెందిన దేవరాజ్ నాయక్(45) చింతచెట్టుకు ఉరి వేసుకున్నాడు. ఆయనకు పదేళ్ల క్రితం వివాహమైంది. సంతానం కలగలేదు. ఈ బాధ చాలదన్నట్లు భార్య అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో దేవరాజ్ నాయక్ మద్యానికి బానిసయ్యాడు. ఒంటరి జీవితంపై విరక్తి చెందిన తమ పొలంలోని చింత చెట్టుకు శనివారం ఉరి వేసుకున్నాడు. దేవరాజ్ తండ్రి అర్జా నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రాజకుళ్లాయప్ప తెలిపారు.



చింత చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న దేవరాజ్‌నాయక్

● రాయదుర్గం పట్టణంలోని మూడో వార్డుకు చెందిన భాగ్యలక్ష్మి(32) ఒంటరి జీవితంపై విరక్తి చెందిన బావిలో దూకింది. ఆమెకు ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. పైళ్లైన నాలుగు నెలలకే భర్త చనిపోయారు. ఆ వేదనతో ఆమె మానసిక అనారోగ్యానికి గురైంది. పలుమార్లు ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించింది. అందరూ చూస్తుండగానే శనివారం మధ్యాహ్నం పట్టణంలోని పాలబావిలో దూకింది. స్థానికులు కాపాడేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో..



నరసింహులు(ఫైల్)

పుట్టపర్తి మండలం బత్తలపల్లికి చెందిన నరసింహులు(52) అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకున్నాడు. నరసింహులు వ్యవసాయం చేసుకుంటూ, గొర్రెలను మేపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. కొన్నాళ్ల నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలోని చెట్టుకు శనివారం ఉరివేసుకున్నాడు. ఆయనకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఇంట్లోవారితో గొడవపడి..



మృతిచెందిన షాహిద్‌ఖాన్

పెద్దవడుగూరు మండలం గుత్తి అనంతపురం గ్రామ సమీపంలో హరియాణాకు చెందిన షాహిద్‌ఖాన్ (20) ఆత్మహత్య చేసుకున్నాడు. లారీ క్లీనర్‌గా పనిచేస్తున్న షాహిద్ ఖాన్, గుత్తి అనంతపురం హైవేలో దాబా వద్ద నుంచి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి గొడవ పడ్డాడు. ఆ తరువాత చెరువుకట్ట వద్ద 220 కేవీ విద్యుత్ స్తంభానికి ఉరివేసుకున్నాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

హెచ్చెల్సీ ఎస్‌ఈగా పురార్ధన్‌రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, మే 24(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ ఎస్‌ఈగా పురార్ధన్‌రెడ్డి నియమితులయ్యారు. నంద్యాల జిల్లా ఎస్‌ఆర్‌బీసీ సర్కిల్-1 ఎస్‌ఈగా ఉన్న పురార్ధన్‌రెడ్డికి హెచ్చెల్సీ ఎస్‌ఈగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇదివరకు హెచ్చెల్సీ ఎస్‌ఈగా ఉన్న రాజశేఖర్ గత నెల 30న పదవీవిరమణ చేశారు. దీంతో ఇన్‌చార్జి ఎస్‌ఈగా పురార్ధన్‌రెడ్డి శనివారం స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. పలువురు ఇంజనీర్లు, ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ ఏడాది 18వేల హెక్టార్లు లక్ష్యం

● ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి

అనంతపురం అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఈ ఏడాది 18వేల హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరు కోసం ప్రభుత్వం లక్ష్యం విధించినట్లు ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో డ్రిప్ మంజూరుకు చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు ఐదు ఎకరాలలోపు 90 శాతం సబ్సిడీ ఉండేదన్నారు. ఐదెకరాల నుంచి 10 ఎకరాలదాకా 70 శాతం సబ్సిడీ ఉండేదన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం 5 నుంచి 10 ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులకు 90 శాతం సబ్సిడీ వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీని వర్తింపజేశారన్నారు. చిన్న, సన్నకారు, పెద్దకారు రైతులు, ఎస్సీ, ఎస్టీ రైతులకు స్ప్రింక్లర్లపై 50 శాతం సబ్సిడీ వర్తింపజేసినట్లు తెలిపారు. రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాల్లో నచ్చిన డ్రిప్, స్ప్రింక్లర్ల కంపెనీ పేరుపై దరఖాస్తు చేసుకోవాలన్నారు.

27న జాబ్‌మేళా

అనంతపురం సెంట్రల్, మే 24(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యవతకు ఈనెల 27న జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కళ్యాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్మదానిష్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ సంస్థలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్‌గా పనిచేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పదో తరగతి పాస్/ఫెయిల్ అయిన విద్యార్థులు అర్హులని అన్నారు. కోర్టురోడ్డులోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు ఆసక్తిగల అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత పత్రాలతో హాజరుకావాలని తెలిపారు.

నిరుద్యోగులకు ఉపాధి కోర్సుల్లో శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, మే 24(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. జావా ఫుల్‌స్టాక్, పైథాన్, డాటా ఇంజనీరింగ్ కోర్సుల్లో ఆరు నెలల పాటు ఐటీ రంగంలో సుమారు 18 సంవత్సరాల అనుభవం ఉన్న శిక్షకులతో అత్యున్నత నాణ్యమైన శిక్షణ ఉంటుందన్నారు. ఇంజనీరింగ్, ఎంసీఏ, ఎమ్మెస్సీ కంప్యూటర్స్ చదివిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. నగరాలలో ఈ కోర్సుకు అయ్యే ఖర్చులో 80 శాతం రాయితీతో, నామమాత్రపు ఫీజు రూ.5వేలు చెల్లించాలన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు ప్రముఖ ఐటీ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 7396950345, 8317594591ను సంప్రదించాలని తెలిపారు.

ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు

● ఏఎస్పీని కలిసిన జడ్పీ చైర్‌పర్సన్, వైసీపీ నాయకులు

అనంతపురంక్రైం, మే24(ఆంధ్రజ్యోతి): తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించిన టీడీపీ ముగ్గురు ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ ఏఎస్పీ రమణమూర్తిని కోరారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ మంత్రి శైలజానాథ్, మాజీ ఎంపీ తలారి రంగయ్యతో కలిసి ఆమె శనివారం ఏఎస్పీని కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 21న జడ్పీ సర్వసభ్య సమావేశం జరుగుతున్న సమయంలో టీడీపీ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుబాటిప్రసాద్‌లు తన అనుమతి లేకుండా వ్యక్తిగత చాంబర్‌లోకి వెళ్లి అధికారులతో దురుసుగా ప్రవర్తించారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఎస్పీని కలిసిన వారిలో మేయర్ మహ్మద్ వసీం, వెన్నపూస రవీంద్రారెడ్డి, జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ నాగరత్న తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే కార్యాలయం వద్ద పాము

● పట్టుకుని దూరంగా వదిలిన స్నేక్‌క్యాచర్



పామును పట్టుకున్న ముస్తఫా

హిందూపురం, మే 24(ఆంధ్రజ్యోతి): హిందూపురం పట్టణంలోని చౌడేశ్వరీ కాలనీలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కార్యాలయం వద్ద పాము కలకలం రేపింది. రెండ్రోజుల పాటు పాము దొరక్కుండా అక్కడే తచ్చాడుతుండటంతో ఆ ప్రాంతంలో నివాసం ఉన్నవారు ఒకింత ఆందోళన చెందారు. ఎమ్మెల్యే కార్యాలయం ముందు నుంచి పెద్దపాము వెళ్తున్నట్లు శుక్రవారం మధ్యాహ్నం కొందరు చూశారు. వెంటనే ఎమ్మెల్యే పీఏ బాలాజీకి చెప్పడంతో పాములు పట్టే ముస్తఫాను పిలిపించారు. అక్కడ చుట్టుపక్కల కార్లు పార్క్‌చేసిన చోట వెతికారు. అయినా దొరకలేదు. అయితే శనివారం ఉదయం మరోసారి ఎమ్మెల్యే కార్యాలయం సమీపంలో బండ కిందకు వెళ్లింది. దీంతో పాములు పట్టే ముస్తఫాను పిలిపించారు. ఆయన బండ కింద ఉన్న పామును పట్టి, ఊరిబయట పొలాల్లోకి వదిలేశారు. అయితే పట్టుబడిన పాము 7.5అడుగుల పొడవు ఉందని ముస్తఫ తెలిపారు.

గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో తనిఖీలు



రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ బ్రహ్మానందం

గుంతకల్లు, మే 24(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్‌లో భద్రత విషయంగా రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీరు (పీసీఈ) బ్రహ్మానందం తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం 7వ నంబరు ప్లాట్‌ఫాంలో గోడ ప్లాస్టింగ్ పెచ్చులు ఊడి పడి మణికంఠ అనే బాలుడు మృతిచెందిన విషయం విదితమే. ఈ సంఘటనపై రైల్వే ప్రిన్సిపల్ ఇంజనీర్ శనివారం ఉదయం స్థానిక రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. ప్రమాద సంఘటనా ప్రదేశాన్ని, రైల్వే స్టేషన్‌లో భవన సముదాయాలను తనిఖీ చేశారు. డెబ్బైయేళ్ల పురాతన భవనాన్ని పీసీఈ పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

నేడు తపాల ఉద్యోగుల సంఘం మహాసభ

అనంతపురం సెంట్రల్, మే 24(ఆంధ్రజ్యోతి): అఖిల భారత గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం(ఏఐజీడీఎస్‌యూ) మహాసభను ఆదివారం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించనున్నారు. ఈ మేరకు అనంతపురం డివిజన్ సెక్రెటరి కృష్ణయ్య యాదవ్ శనివారం ప్రకటనలో తెలిపారు. అనంతపురం డివిజన్, గుంతకల్లు బ్రాంచ్ సంయుక్త 8వ వార్షిక మహాసభలో గ్రామీణ తపాల ఉద్యోగుల సమస్యలపై చర్చిస్తామని పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, హిందూపురం ఎంపీ పార్థసారథితోపాటు ఏఐజీడీఎస్‌యూ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, మహాదేవయ్య హాజరు కానున్నట్లు తెలిపారు.

మృతదేహంతో నిరసన

● రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి
● 9 రోజులైనా కారకులను పట్టుకోలేదని ఆగ్రహం
● పోలీసుస్టేషన్ వద్ద మృతుడి బంధువుల ఆందోళన

హిందూపురం, మే 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడి మృతి చెందినా.. నిందితులను అరెస్ట్ చేయడంలో నిర్లక్ష్యం వహించిన పోలీసుల తీరుపై బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందిన వీరన్న(25) అనే యువకుడి బంధువులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌వద్ద శనివారం నిరసన తెలిపారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 16న రాత్రి కగ్గల్లుకు చెందిన వీరన్న పట్టణంలో గుంటూరు సెల్యూల పని ముగించుకుని స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. కొట్నూరు సమీపంలోని పెట్రోల్‌బంక్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు. బెంగళూరులో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. వారు మృతదేహాన్ని అంబులెన్స్‌లో నేరుగా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఉంచి స్టేషన్ గేటువద్ద మహిళలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రమాదం జరిగిన రోజే పోలీసులకు ఫిర్యాదు చేశామని, ఇప్పటి వరకు ప్రమాదానికి కారణమైన వాహనాన్నికానీ, కారకులనుకానీ అరెస్ట్ చేయలేదని మండిపడ్డారు. ప్రమాదానికి కారణమైన వాహన యజమానిని పోలీసులు పిలిపించుకుని మాట్లాడి పంపించేశారని ఆరోపించారు. సీఐ రాజగోపాల్‌నాయుడు, ఎస్‌ఐ శ్రీధర్ వారివద్దకు వెళ్లి సర్దిచెప్పారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని, అందుకు కారకులైన వారిని పట్టుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని కగ్గల్లుకు తీసుకెళ్తూ కొట్నూరు పెట్రోల్‌బంక్ వద్ద మరోసారి రోడ్డుపై నిరసన చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అక్కడికి వెళ్లి పంపించేశారు.



మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఉంచి స్టేషన్ ముందు నిరసన తెలుపుతున్న బంధువులు

మావోయిస్టులతో చర్చలు జరపాలి

● ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి
● ప్రజా సంఘాల జేఏసీ నాయకులు



నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

అనంతపురం సెంట్రల్, మే 24(ఆంధ్రజ్యోతి): ఆదివాసి ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ప్రజాసంఘాల జేఏసీ నాయకులు కోరారు. శనివారం నగరంలోని బుద్ధవిహార్ పార్కులో 'మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి' అన్న అంశంపై జేఏసీ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. అడవుల్లోని ఖనిజ సంపదను బహుళజాతి సంస్థలకు కట్టబెట్టాలన్న ఒప్పందంలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ నిర్వహిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో వేలాదిమంది ఆదివాసీలను నిర్దాక్షిణ్యంగా మట్టుబెడుతున్నారని అన్నారు. మావోయిస్టులను బూచిగా చూపుతూ ఎక్కడికక్కడ కాల్చిచంపి ఎన్‌కౌంటర్ కట్టుకథలల్లడం పరిపాటిగా మారిందని విమర్శించారు. విలువైన ఖనిజ సంపదలు కొల్లగొట్టే ప్రయత్నంలో అడ్డుతగులుతున్న మావోయిస్టులను సైతం చంపేస్తున్నారని తెలిపారు. వేలాదిమంది కేంద్ర బలగాలతో అడవులను చుట్టుముట్టి నెలల తరబడి గాలిస్తూ పచ్చటి అడవులను ఎర్రటి నెత్తురుగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆపరేషన్ కగార్, గ్రీన్ హంట్, బూటకపు ఎన్‌కౌంటర్లపై వామపక్ష పార్టీలు, ప్రజాస్వామిక, అభ్యుదయ వాదులు, కుల, ప్రజా, విద్యార్థి, మహిళా సంఘాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి, ఇతర ప్రజాసంఘాల నాయకులు కేపీ రాజు, వేమన, టీపీ రెడ్డి, చిందలూరి రామాంజులు, చంద్రప్ప, చంద్రచర్ల హరి, శంకర్ కుళ్లాయప్ప, నాగరాజు, రామకృష్ణ, సూర్యనారాయణ, నరేంద్ర పాల్గొన్నారు.

సవాళ్లు కాదు..నీళ్లు సాధించండి

● హంద్రీనీవా కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలి
● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్

గుంతకల్లుటౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవాపై ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సవాళ్లు, ప్రతి సవాళ్లు చేసుకోవడం కాకుండా ఉమ్మడి జిల్లాలో 3.5 లక్షల ఎకరాలకు సాగు నీటి కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జగదీష్ హితవు పలికారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకూ హంద్రీనీవా కాలువ లక్ష్యం నెరవేరలేదన్నారు. వర్షాలు తక్కువగా వచ్చే కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల ఆరు లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాల్సి ఉందని, కానీ ఒక ఎకరాకు కూడా ఇవ్వలేదన్నారు. హంద్రీనీవా కాలువ నుంచి కృష్ణజలాలు ఉమ్మడి జిల్లాకు వస్తున్నాయంటే దానికి రైతు సంఘాలు, ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల దశాబ్దాల పోరాటమే కారణమన్నారు. హంద్రీనీవా నుంచి కుందుర్పి బ్రాంచ్ కెనాల్ ద్వారా 114 చెరువులకు నీరు ఇవ్వాలన్నారు. భైరవతిప్పాని ప్రాజెక్టుకు వెంటనే నీరు ఇవ్వాలన్నారు. పిల్ల కాలువల పనులు పూర్తిచేయాలన్నారు. హంద్రీనీవా నీటిని పూర్తి స్థాయిలో సాధించడానికి అన్ని రాజకీయ పార్టీలు కలిసికట్టుగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయకార్యదర్శి మహేష్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్‌ఎండీ గౌస్, నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగదీష్

న్యూస్ బాక్స్

డీ-అడిక్షన్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు

అనంతపురం అర్బన్, మే 24(ఆంధ్రజ్యోతి): మద్యంపానం, మాదకద్రవ్యాలకు అలవాటుపడి బానిసలైన వారికి డీ - అడిక్షన్‌పై ఎక్సైజ్ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. నగరంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని డీ -అడిక్షన్ కేంద్రంలో శనివారం అనంతపురం ఎక్సైజ్ సూప రింటెండెంట్ రామమోహన్‌రెడ్డి అధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీ అడిక్షన్ సెంటర్ నోడల్ ఆఫీసర్ వరదరాజులు, ఎక్సైజ్ సీఐలు సత్యనారాయణ, జయనాథ్‌రెడ్డి, ఎస్ఐలు జయనరసింహ, జాకీర్‌హుస్సేన్,కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రాణుల సేవే దేవుడి సేవ'

అనంతపురం కల్చరల్, మే 24(ఆంధ్రజ్యోతి): సృష్టిలో మానవులే కాకుండా అన్ని ప్రాణులకు సేవ చేయడమే సర్వేశ్వరుడి సేవ అని మహనీయులు చెబుతారని సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయ సాయికుమార్ అన్నారు. ఆ మేరకు వేసవి నేపథ్యంలో మూగ జీవుల దాహార్తిని తీర్చేందుకు ఆయన తన తల్లి రుక్మిణి సహకారంతో నగరంలోని వివిధ ప్రాంతాల్లో పది నీటితొట్లెలను ఏర్పాటు చేశారు. ప్రతిఒక్కరూ తమకు చేతనైనంత మేరకు పక్షులు, జంతువులకోసం నీటితొట్లెలు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా అపార్ట్‌మెంట్‌ల పైభాగాన నీటిని ఉంచితే ఆ నీటిని పశుపక్షాదులు తాగి సేదతీరుతాయని ఆయన అన్నారు.


పశుపక్షాదులకోసం నీటితొట్లెలు ఏర్పాటు చేస్తున్న సాయి ట్రస్టు సిబ్బంది

టీడీపీ గొల్లపల్లి కమిటీ అధ్యక్షుడిగా సంజీవరెడ్డి

రాప్తాడు, మే 24(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని గొల్లపల్లి టీడీపీ గ్రామ కమిటీని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సంజీవరెడ్డి, ఉపాధ్యక్షుడిగా చిన్న నరసింహులు, ప్రధాన కార్యదర్శిగా విజయభాస్కర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎంపికైన సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో పార్టీ మరింత బలోపేతం కోసం కష్టపడి పనిచేస్తామని పేర్కొన్నారు.

'అనధికారికంగా విద్యుత్ వినియోగిస్తే చర్యలు'


చంద్రాచెర్లలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కనగానపల్లి, మే 24(ఆంధ్రజ్యోతి): అనధికారికంగా విద్యుత్ వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారులు శ్రీనివాసులు, శంకర్ తెలిపారు. మండల పరిధిలోని చంద్రాచెర్ల గ్రామంలో శనివారం విద్యుత్‌శాఖ సిబ్బందితో కలిసి విజిలెన్స్ అధికారులు పర్యటించారు. ఇదివరకే గ్రామంలో అనధికారికంగా విద్యుత్ ఉపయోగిస్తున్న ఐదుగురిపై కేసు నమోదైందన్నారు. వారికి జరిమానా శనివారం విధించి వసూలు చేశారు.

ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి

రాప్తాడు, మే 24(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలని ఈఓఆర్డీ ఆనంద్ ప్రసాద్ సూచించారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు ప్లాస్టిక్ వాడకం వలన కలిగే నష్టాలను వివరించారు. ప్లాస్టిక్ వాడకుండా పేపర్ బ్యాగులు వాడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ చోరీపై ఫిర్యాదు

కనగానపల్లి, మే 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కనగానపల్లికి చెందిన రైతు సెట్టెం శ్రీనాథ్ పొలంలో వ్యవసాయ బోరుబావికి ఏర్పాటు చేసిన కేబుల్‌ను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కత్తిరించి ఎత్తుకెళ్లారు. శనివారం పొలానికి వెళ్లిన రైతు స్టార్టర్ పెట్టె వద్ద కేబుల్ వైరు దొంగలించడాన్ని గుర్తించారు. గతంలో స్టార్టర్ పెట్టెను కూడా దొంగలు ఎత్తుకెళ్లారని బాధిత రైతు తెలిపాడు. ఈ ఘటనపై రైతు కనగానపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


గుండె పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రామగిరి, మే 24(ఆంధ్రజ్యోతి) :మండలంలోని ముత్యాలంపల్లిలో శనివారం అనంతపురంలోని మార్క్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గుండె వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ వైద్యశిబిరానికి 139 మంది రోగులు రాగా పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, గుండెకు సంబంధించి పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్న వారిని మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేశారు. ఎమ్మెల్యే పరిటాలసునీత, పరిటాలశ్రీరామ్ సహకారంతోనే మారుమూల ప్రాంతంలో ఇలాంటి వైద్యశిబిరం నిర్వహించినట్లు వారు తెలిపారు. వైద్యశిబిరంలో టీడీపీ నాయకులు రామ్మోహన్‌చౌదరి, రామ్మూర్తినాయుడు, లింగాశ్రీధర్‌నాయుడు, కాంతస్వామి తదితరులు పాల్గొని సహాయ సహకారాలు అందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గార్లదిన్నె, మే 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామదాసుపేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామాంజినేయులు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కూడేరుకు చెందిన రామాంజినేయులు ద్విచక్ర వాహనంలో పామిడికి వెళుతున్నాడు. రామదాసుపేట వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడింది. ఈ ప్రమాదంలో రామాంజి నేయులు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కడపలో మహానాడుకు తరలిరండి: ఎమ్మెల్యే


నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈ నెల 27వ తేదీ నుంచి జరిగే రాష్ట్ర స్థాయి టీడీపీ మహానాడు వేడుకలకు పెద్దఎత్తున నా యకులు, కార్యకర్తలు తరలిరావాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆయన శనివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, నియోజక వర్గ పరిశీలకుడు లక్ష్మీనారాయణతో కలిసి అనంతపురం అర్బన్ నాయ కులతో సమావేశమయ్యారు. మహానాడుకు తరలివెళ్లేం దుకు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఈనెల 27 నుంచి మూడు రోజులపాటు కడపలో మహానాడు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ.... మహానాడులో తొలి రోజు పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి, రెండో రోజు ఈ ప్రభుత్వ ఏడాది విజయంపై చర్చ, మూడో రోజు ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించాలని అధిష్ఠానం నిర్ణయించిందని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని మూడో రోజు బహిరంగ సభకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మహానాడుకు వచ్చే కార్యకర్తలకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగారామ్, తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, లక్ష్మీనరసింహ, ఫిరోజ్ అహ్మద్, స్వామిదాస్, రమేష్, ముక్తియార్, చేపల హరి, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

మహానాడు ఏర్పాట్ల పరిశీలన : కడపలో మహానాడు ఏర్పాట్లను శనివారం సాయంత్రం ఎమ్మెల్యే దగ్గుపాటి పరిశీలించారు. మంత్రులు నిమ్మలరామానాయుడు, బీసీ జనార్దన్‌రెడ్డి, ఏడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, ఇతర నాయకులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు.

వ్యవసాయానికి ప్రభుత్వం అండ

- సబ్సిడీతో యంత్ర పరికరాల పంపిణీ
- రైతుల హర్షం


సబ్సిడీ వ్యవసాయ యంత్ర పరికరాలు అందిస్తున్న ఎమ్మెల్యే (ఫైల్)

రాప్తాడు, మే 24(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోంది. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రైతులకు సబ్సిడీ ద్వారా వ్యవసాయ యంత్ర పరికరాలు, డ్రిప్పు అందిస్తోంది. ప్రభుత్వం సబ్సిడీ ద్వారా వ్యవసాయానికి అవసరమైన పరికరాలు అందిస్తుండటంతో సకాలంలో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వ్యవసాయ యంత్ర పరికరాలు అందించలేదని రైతులు వాపోతున్నారు. అరకొరగా మంజూరైనా వైసీపీ మద్దతుదారులకు మాత్రమే అందజేశారని అంటున్నారు. రాప్తాడు నియోజకవర్గంలో హంద్రీనీవా, పీఏబీఆర్ కుడికాలువలు ఉండటం వలన దాదాపు అన్ని చెరువులకు ప్రతి ఏడాది నీరు చేరుతోంది. చెరువుల్లో నీరు పుష్కలంగా ఉండటం వలన రైతులు విరివిగా బోర్లు వేసి పంటలు సాగు చేస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కాడెద్దులు అంతరించిపోవడంతో రైతులు ట్రాక్టర్ల ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తున్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా వేలల్లో ట్రాక్టర్లు ఉన్నాయి. దీంతో వ్యవసాయ పనులు చేసుకునేందుకు యంత్ర పరికరాలు చాలా అవసరం. వాటిని ప్రైవేటుగా కొనాలంటే ఎక్కువ మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. గత వైసీపీ పాలనలో వ్యవసాయ యంత్ర పరికరాలు అర్హులైన రైతులందరికీ అందించలేదని, వైసీపీ మద్దతుదారులకు మాత్రమే అరకొరగా పంపిణీ చేశారనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడ్డాక అర్హులైన రైతులందరికీ కావాల్సిన వ్యవసాయ యంత్ర పరికరాలను సబ్సిడీతో అందిస్తున్నారు. రోటావేటర్, విత్తన గొర్రు, ట్రిల్లర్, ఐదు మడకలు, ఏడు మడకలు, గుంటక, తైవాన్ స్ప్రేయర్లు, చార్జింగ్ స్ప్రేయర్లు అందజేస్తున్నారు. వ్యవసాయ పరికరాలను బట్టి 30 నుంచి 50 శాతం సబ్సిడీతో రైతులకు అందజేస్తున్నారు. రాప్తాడు, అనంతపురం రూరల్, ఆత్మకూరు మండలాలకు చెందిన రైతులకు ఇటీవల రాప్తాడులో ఎమ్మెల్యే పరిటాల సునీత వ్యవసాయ అధికారులతో కలిసి సబ్సిడీ పరికరాలను పంపిణీచేశారు. మూడు మండలాలకు కలిపి మొత్తం రూ. 25 లక్షలు విలువ చేసే యంత్ర పరికరాలు అందించారు. అందులో రూ. 12 లక్షలు సబ్సిడీ పోగా రైతులు రూ. 13 లక్షలు చెల్లించారు.

సబ్సిడీతో రోటావేటర్ తీసుకున్నా



గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు సబ్సిడీ వ్యవసాయ యంత్ర పరికరాలు ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతులకు కావాల్సిన వ్యవసాయ పరికరాలను సబ్సిడీతో అందిస్తున్నారు. రూ. 1.30 లక్షలు విలువ చేసే రోటావేటర్‌ను సబ్సిడీ ద్వారా రూ. 89 వేలకే వ్యవసాయ అధికారులు నాకు అందజేశారు.

- చిన్న ఉజ్జిన్న, రైతు, రాప్తాడు

రైతులకు ఎంతో ఉపయోగకరం



గత వైసీపీ పాలనలో సబ్సిడీ ద్వారా వ్యవసాయ యంత్ర పరికరాలు అందించకపోవడంతో రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఈ ప్రభుత్వం ఏర్పడ్డాక ఎమ్మెల్యే పరిటాల సునీత అర్హులైన రైతులకు వ్యవసాయ పరికరాలు అందజేస్తున్నారు. ఈ పరికరాలు రైతులకు ఎంతో ఉపయోగకరం.

- తలారి చెంద్రాయుడు, రైతు బండమీదపల్లి

రెండు నెలల తరువాత దరఖాస్తు చేసుకోవచ్చు

రైతులకు అవసరమైన వ్యవసాయ యంత్ర పరికరాలను సబ్సిడీ ద్వారా అందజేశాం. పరికరాలు కావాల్సిన రైతులు రెండు నెలల తరువాత దరఖాస్తు చేసుకుంటే వారికి కూడా అందజేస్తాం. - శ్రీవాణి, ఏఓ, రాప్తాడు

ఇన్‌సర్వీస్ టీచర్లకు బదిలీల్లో అవకాశమివ్వాలి

- డీఈఓకు ఎంఈఎఫ్ నాయకుల వినతి


డీఈఓకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురం విద్య, మే 24(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల్లో ఇన్‌సర్వీస్ బీఈడీ టీచర్లకు అవకాశం కల్పించాలని ఎంఈఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆ సంఘం జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ ఇతర నాయుకులు డీఈఓ ప్రసాద్‌బాబును కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎస్‌జీటీలుగా పనిచేస్తూ.. ఇన్‌సర్వీస్‌లో బీఈడీ కోర్సు చాలా మంది టీచర్లు చేస్తున్నారన్నారు. అయితే 2023-2025 బ్యాచ్ టీచర్లు మాత్రమే బదిలీకి దరఖాస్తు చేసే వెసలుబాటు ఇచ్చారన్నారు. 2024-26 బ్యాచ్ టీచర్లకు అవకాశం ఇవ్వకపోవడంతో వారికి తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. వీరిలో కూడా చాలా మంది 2016లో నుంచి మారుమూల ప్రాంతాల్లో తొమ్మిదేళ్ల పాటు పనిచేసిన వారు ఉన్నారన్నారు. అయితే అలాంటి వాళ్లకు ఈ బదిలీల్లో అవకాశం ఇవ్వకపోవడంతో 1977 నుంచి ఇన్ సర్వీస్ ఎస్సీ, ఎస్టీ టీచర్ల ఆన్‌డ్యూటీ సౌకర్యాన్ని ప్రభుత్వమే నీరుగార్చినట్టు అవుతుందన్నారు. ఆ వర్గం టీచర్ల సమస్యను దృష్టిలో ఉంచుకుని వాళ్లకు బదిలీల్లో దరకాస్తు చేసుకోడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు డీఈఓకు వినతిపత్రం అందించారు.

నర్సరీలకు విత్తన సేకరణ పూర్తి చేయండి: డీఎఫ్ఓ

అనంతపురం న్యూటౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నర్సరీల అభివృద్ధికి విత్తన సేకరణ వేగవంతం చేయాలని డీఎఫ్ఓ విఘ్నేష్ సిబ్బందికి సూచించారు. ఆయన శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో పచ్చదనం పెపొందించాలంటే విరివిగా మొక్కలు నాటాలని, అందుకు అనుగుణంగా మొక్కలను పంపిణీ కోసం నర్సరీల్లో సిద్ధం చేయాలన్నారు. కావాల్సిన విత్తనాన్ని అందుబాటులో ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకు అనుగుణంగా తగిన చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.

వైద్యకళాశాలలో యోగా తరగతులు


యోగాసనాలు వేస్తున్న ప్రిన్సిపాల్, డాక్టర్లు, మెడికోలు


అనంతపురం టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక మెడికల్ కళాశాలలో యోగా తరగతులు ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాల రావు ముఖ్య అతిథిగా పాల్గొని యోగాసనాలు చేస్తూ తరగతులను ప్రారంభించారు. వచ్చే నెల 21 వరకు కళాశాలలో ఈ తరగతులు కొనసాగుతాయని తెలిపారు. డాక్టర్లు, మెడికోలు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

మెగా డీఎస్సీ నిరుద్యోగులకు వరం: ఎంపీ


డీఎస్సీ అభ్యర్థులతో మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం విద్య, మే 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా 16వేల పైచిలుకు పోస్టులు భర్తీ చేయ నుండటం నిరుద్యోగులకు వరమని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొ న్నారు. మెగా డీఎస్సీ నేపథ్యంలో మోడల్ డీఎస్సీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ముందుగానే అవగాహన వస్తుందన్నారు. ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో మోడల్ డీఎస్సీ నిర్వహించారు. పరీక్షలను ఎంపీ పరిశీలించారు. అభ్యర్థులతో ముఖాముఖి మాట్లాడారు. సొసైటీ ఫౌండర్ సుంకర రమేష్ మాట్లాడుతూ... నిపుణులతో ప్రశ్నపత్రాలు రూపొందించి అనంతపురం, గుంతకల్లులో ఈ పరీక్షలు నిర్వహించామన్నారు. సుమారు రెండు వేల మంది వరకు హాజరయ్యారని తెలిపారు. సొసైటీ కార్యదర్శి చాందిని, సహాయ కార్యదర్శి రఘు, రాఘవేంద్ర, సొసైటీ అధ్యక్షులు మల్లికార్జున, ఇతరులు శివ, రవీంద్ర, అలీసాబ్, మహేంద్ర, ధోని, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు


గంగలకుంటకు వెళ్లే దారిలో ఏర్పడిన గుంతలు

రాప్తాడు, మే 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రాప్తాడు నుంచి గంగలకుంట గ్రామానికి వెళ్లే దారి గుంతలమయంగా ఉంది. చాలా ఏళ్ల క్రితం నిర్మించడంతో తారురోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. మండల కేంద్రమైన రాప్తాడు నుంచి గంగలకుంట రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. 44వ, 42వ జాతీయరహదారులకు పక్కనే ఉన్న ఈ గ్రామానికి రోడ్డు గుంతల మయంగా ఉంది. చాలా ఏళ్ల నుంచి తారురోడ్డుకు మరమ్మతులు కూడా చేయలేదు. అలాగే గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామ చెరువు మరవ సమీపంలో జగనన్న కాలనీ ఏర్పాటైంది. ఇళ్లు మంజూరవడంతో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నారు. కాలనీకి వెళ్లే దారి మట్టి రోడ్డు కావడంతో వర్షాకాలంలో చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతోంది. రోడ్డుకు మట్టి తోలించి చదును చేస్తే కాలనీకి, పొలాలకు వెళ్లే వారికి సౌకర్యంగా ఉంటుందని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా గుంత

రాప్తాడు, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండమీదపల్లి నుంచి వరిమడుగు వెళ్లే దారిలో పీఏబీఆర్ కుడి కాలువ సమీపంలో గుంత ప్రమాదకరంగా ఉంది. ఆ దారి గుండా నిత్యం వాహనాలు వెలుతుంటాయి. రాత్రి సమయంలో కూడా ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు వెలుతుంటాయి. రహదారి మధ్యలో గుంత ఉండటం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రహదారి మధ్యలో ఉన్న గుంత పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.


రోడ్డుమీద ప్రమాదకరంగా ఉన్న గుంత

మునగ సాగును ప్రోత్సహించాలి

- సమీక్షలో కలెక్టర్ వినోద్‌కుమార్ సూచన


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

అనంతపురం టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మునగ పంట సాగును ప్రోత్స హించాలని కలెక్టర్ వినోద్ కుమార్ అధికారులకు సూచించారు. ఆయన శనివారం కలెక్టరేట్‌లో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మునగలో అద్భుతమైన పోషకాలు ఉన్నాయన్నారు. మరోవైపు రైతులకు లాభదాయకమైన పంట అన్నారు. ఇలాంటి పంటలపై రైతులకు అవగాహన కల్పించి అధికంగా సాగుచేసేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. రాయదుర్గం నియోజకవర్గాలలో ప్రతి మండలంలో వంద ఎకరాల్లో మునగ సాగు లక్ష్యంగా పెట్టుకుంటే అక్కడ ప్రాసెసింగ్ యూనిట్స్ ఏర్పాటుచేస్తామన్నారు. ఎకరాకు ఆరు వేల నుంచి ఎనిమిది వేల మునగమొక్కలు నాటవచ్చన్నారు. మునగను ఆహారంగానే కాకుండా ఔషధ తయారీలో పౌడర్‌గా, నూనెగా తయారు చేసి ఉపయోగించవచ్చన్నారు. రైతులు పెద్దఎత్తున ఈ పంట సాగుకు ముందుకు వచ్చేవిధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, డీఆర్‌డీఏ పీడీ శైలజ, పశసంవర్ధకశాఖ జేడీ వెంకటస్వామి, హార్టికల్చర్ డీడీ రఘునాథరెడ్డి, ఏడీ ఫిరోజ్‌ఖాన్, డీపీఎం లక్ష్మానాయక్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి చెత్తసేకరణ రోజూ జరగాలి

● అనంతపురం టౌన్: ప్రభుత్వం, సీఎం చంద్రబాబునాయుడు పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, ప్రతిరోజు ఇంటింటికి వెళ్లి చెత్తసేకరణ చేపట్టాలని అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. ఆయన శనివారం కలెక్టరేట్‌లో చెత్తసేకరణపై సమీక్ష నిర్వ హించారు. ప్రతి నివాసప్రాంతంలో వందశాతం చెత్తసేకరణ జరగాలన్నారు. ప్రభుత్వం ఐవీఆర్ఎస్ సర్వే చేస్తోందని అనంతపురం రూరల్ మండలం కందుకూరులో చెత్తసేకరణ జరగలేదని ఫిర్యాదులు వచ్చాయన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చాయని, వాటిని చెత్త సేకరణకు అవసరం మేరకు ఖర్చుపెట్టాలన్నారు. నిర్లక్ష్యం చేసిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీఎల్పీఓ విజయ్‌కుమార్, డీపీఆర్సీ మాధవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈవీఎంల గోడౌన్‌కు పటిష్ట భద్రత చేపట్టాలి

● అనంతపురం టౌన్: ఈవీఎంల గోడౌన్‌కు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయన శనివారం జిల్లా కేంద్రంలోని పాత ఆర్డీఓ కార్యాలయంలో ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్‌ను తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఉన్న ఈవీఎంలను పరిశీలించి, వాటి భద్రతపై ఆరాతీశారు. ఈవీఎం భద్రత విషయంలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, సెక్షన్ అధికారి యుగేశ్వరి, తహసీల్దార్ హరికుమార్, వివిధపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్యాస్‌కు అధికంగా వసూలు చేస్తే చర్యలు

- కలెక్టర్ వినోద్‌కుమాంర్ హెచ్చరిక

అనంతపురం టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): గ్యాస్ సరఫరాలో నిర్ణయించిన ధర కన్నా లబ్ధిదారుల నుంచి అధికంగా డబ్బు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, జాగ్రత్త అంటూ కలెక్టర్ వినోద్ కుమార్ హెచ్చరించారు. ఆయన శనివారం కలెక్టరేట్‌లో ఏజెన్సీలు, ఆపరేటర్లు, సంబంధితశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్యాస్ సరఫరాలో డెలివరీ బాయ్స్ తీరు సరిగాలేదని ఐవీఆర్ఎస్ సర్వేలో ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయన్నారు. పలు ఏజెన్సీల పనితీరుపైనా అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. మీపనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే రేషన్ సరకులను సకాలంలో లబ్ధిదారులకు అందించాలన్నారు. నాణ్యమైన సరకులు, బియ్యం పంపిణీ జరగాలన్నారు. ఐవీఆర్ఎస్‌లో వస్తున్న ఫిర్యాదులు ఆధారంగా చర్యలు ఉంటాయని సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ, శివనారాయణశర్మ, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, సీఎస్డీటీలు, రేషన్‌షాపుడీలర్లు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ పోస్టర్ల విడుదల


ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్

అనంతపురం క్లాక్‌టవర్, మే 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ప్రోత్సహించడంతోనే ఉత్తమ, ఉన్నత స్థానాలకు చేరుకుంటారని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదోతరగతిలో 550 మార్కులు పైన సాధించిన విద్యార్థులకు ఏపీఎస్ఎఫ్, ఇన్‌స్పైర్ సంస్థ సంయుక్తంగా అందజేయనున్న ఉత్తమ ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవానికి సంబంధించిన పోస్టర్లను శనివారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్ చేతుల మీదుగా విడుదల చేశారు. కుల, మతాలకు అతీతంగా ప్రతిభ ఉన్న విద్యార్థులకు పురస్కారాలు అందజేసి ప్రోత్సాహించేందుకు ముందుకు వచ్చినందుకు ఏపీఎస్ఎఫ్, ఇన్‌స్పైర్ సంస్థను కలెక్టర్ అభినందించారు. ఈ అవకాశాన్ని పదోతరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఎఫ్, ఇన్‌స్పైర్ సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుల రాఘవేంద్ర, నాయకులు గురుసాయి, పవన్‌కుమార్ రెడ్డి, చంద్రశేఖర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల వేలంతో నెలకు రూ. 59,769 ఆదాయం

గార్లదిన్నె, మే 24(ఆంధ్రజ్యోతి): డీఎల్‌పీఓ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం గార్లదిన్నె పంచాయతీకి సంబంధించిన ఎనిమిది దుకాణాలకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో 10 మంది పాల్గొన్నారు. అయితే వేలంలో పాటదా రులు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో గతంలో ఉన్న వారే దుకాణాలను దక్కించుకున్నారు. ఇందులో ఎనిమిది షాపులకు సంబంధించి పంచాయతీకి నెలకు రూ. 59,769 ఆదాయం వస్తుందని పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. అదేవిధంగా 4వ షాపు ఎస్సీ రిజర్వుడ్ కావడంవల్ల, పదో దుకాణం విషయం కోర్టులో ఉన్నందున వేలం వేయలేదన్నారు. కార్యక్రమంలో సర్పంచు సుబ్బమ్మ, డిప్యూటీ ఎంపీడీఓ దామోదరమ్మ, ఉప సర్పంచు శేక్షావలి, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

ఈ రోడ్డుపై ప్రయాణం నరకం

- కంకర తేలి, గుంతలపడి అధ్వానంగా ఉన్న కూడేరు- సింగంపల్లి రోడ్డు
- ప్రయాణించాలంటే జంకుతున్న వాహనదారులు
- ఏళ్లు గడుస్తున్నా.. పట్టించుకోని పాలకులు, అధికారులు


కంకర తేలి, గుంతలు పడి అధ్వానంగా ఉన్న రోడ్డు


దెబ్బతిన్న కల్వర్టు

కూడేరు, మే 24(ఆంధ్రజ్యోతి): కూడేరు మండలకేంద్రం నుంచి ఆత్మకూరు మండలంలోని సింగంపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు కంకర తేలి, గుంతలు పడి తీవ్ర అధ్వానంగా మారింది. మధ్యలో ఉన్న కల్వర్టు సైతం దెబ్బతింది. దీంతో ఆ రోడ్డుపై ప్రయాణించాలంటే నరకం కనపడుతోందని వాహనదారులు వాపోతున్నారు. ఉరవకొండ, రాప్తాడు నియోజకవర్గాల పరిధిలో నున్న ఈ రోడ్డు దెబ్బతిని ఏళ్లు గడుస్తోంది. అయినా ఇంతవరకు పాలకులు కానీ, అధికారులు కానీ పట్టించుకోలేదు. కూడేరు నుంచి సింగంపల్లి గ్రామానికి దాదాపు 6 కిలోమీటర్లు దూరం ఉంది. కూడేరు నుంచి ఆత్మకూరుకు వెళ్లేందుకు సింగంపల్లి గ్రామం మీదుగా వెళితే దూరం తగ్గుతుంది. దీంతో అధికంగా ఆటోలు, ద్విచక్రవాహనాల్లో ప్రయాణికులు, వాహనదారులు నిత్యం ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగించేవారు. అయితే కొన్నేళ్లుగా రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రయాణించాలంటే జంకాల్సి వస్తోంది. తప్పని పరిస్థితిల్లో వెళ్లిన వారికి నరకం కనపడుతోంది. గుంతల వల్ల ద్విచక్రవాహదారులు ప్రమాదాలకు సైతం గురవుతున్నారు. ఈ నెల 3న సింగవల్లి తండాకు చెందిన అరుణమ్మ, ఆమె భర్త ఆదినారాయణ నాయక్ ద్విచక్రవాహనంలో కూడేరుకు వస్తూ వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన అరుణమ్మ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఇలా ఎన్నో ప్రమాదాలు తరచూ చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఆ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

గుత్తి కోట సందర్శన


గుర్రపు శాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా

గుత్తి, మే 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చారిత్రాత్మక గుత్తికోటను మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మియా, సిబ్బంది శనివారం సందర్శించారు. జూన్ 2వ తేదీన జరగబోయే యోగా దినోత్సవం ఏర్పాటుకు సంబంధించి గుత్తి కోటలోని గుర్రపు శాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇక్కడ యోగాడే నిర్వాహణకు అద్భుతంగా ఉంటుందన్నారు. తర్వాత గుత్తికోటలో రెక్కింగ్ చేస్తూ పురాతన కట్టడాలను పరిశీలించారు. దారిలో ఉన్న సయ్యద్ బాషా మీర్ ఖాసీం దర్గాలో ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ మేనేజర్ రాంబాబు, విజయ్‌భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

రాకెట్ల నారాయణరెడ్డికి ఘన నివాళి

ఉరవకొండ, మే 24(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు నాయకుడు రాకెట్ల నారాయణరెడ్డి 30వ వర్ధంతిని పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం సీపీఐ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత పలువురు మాట్లాడుతూ.. రాకెట్ల నారాయణ రెడ్డి పేదల పక్షపాతి అని, పేదల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. అలాగే రాకెట్ల గ్రామంలోనూ నారాయణరెడ్డి వర్ధంతిని నిర్వహించారు కార్యక్రమాల్లో సీపీఐ నాయకులు మల్లికార్జున, చెన్నరాయుడు, మల్లేష్, సుల్తాన్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వై. మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ ఖాతాలు తొలగించండి

బొమ్మనహాళ్, మే 24(ఆంధ్రజ్యోతి): ఎల్పీ నంబర్లు, జాయింట్ ఖాతా నంబర్ల వల్ల ఇబ్బందులు పడుతున్నామని వాటిని తొలగించడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని మండలంలోని కొళగానహళ్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు వాపోయారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం వద్ద శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. 103 బీ, 104, 105 సర్వేనంబర్‌లలో 27 ఎకరాలను 600 రైతులు కలిగి ఉన్నామని, అయితే జాయింట్ ఖాతాల వల్ల 1బీ అడంగల్ రావడం లేదని రైతులు ధనుంజయ, తిప్పయ్య, రామరాజు, సిద్దమ్మ, గంగమ్మ, రామరాజు తదితరులు తెలిపారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సింగల్ ఎల్‌పీ నంబర్లు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


హనుమంతి (ఫైల్)

డీ.హీరేహాళ్, మే 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని సిద్దాపురం గ్రామానికి చెందిన బసవరాజు, భార్య హనుమంతి(29) కలిసి ఈ నెల 17వ తేదీన గ్రామ సమీపంలో ఉన్న కొండ ప్రాంతంలో కట్టెలు కొట్టుకుని ద్విచక్రవాహనంలో ఇంటికి బయలుదేరారు. కొద్ది దూరం రాగానే బైక్‌లో వెనుక కూర్చున్న హనుమంతి అదుపుతప్పి కింద పడిపోయింది. ప్రమాదంలో తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం బళ్లారి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ చెప్పారు. హనుమంతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

టీడీపీ నాయకురాలి మృతికి నివాళి


హంపమ్మ (ఫైల్)

కణేకల్లు, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్యం గ్రామానికి చెందిన టీడీపీ నాయకురాలు ఉప్పర హంపమ్మ(75) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆమె భర్త రామలింగప్ప గ్రామానికి సర్పంచ్‌గా గతంలో పని చేశారు. టీడీపీ అభివృద్ధికి వీరి కుటుంబం ఎంతోగానో కృషి చేసింది. ఆమె మృతదేహాన్ని పార్టీ మండల కన్వీనర్ లాలెప్ప, నాయకులు ఆనంద్‌రాజ్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. అలాగే కుటుంబసభ్యులను పరామర్శించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

గుంతకల్లు టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పట్టణంలోని శ్రీశంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల డైరెక్టర్ గోపాల్ సూచించారు. పట్టణంలోని కళాశాలలో శనివారం బీకాం కంప్యూటర్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. విద్యతోనే గుర్తింపు, హోదా లభిస్తుందన్నారు. కనుక విద్యార్థులు బాగా చదివి ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు. అనంతరం జూనియర్ విద్యార్థులు, సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు పలికారు. అధ్యాపకులు వెంకటేశ్వర్లు, వరప్రసాద్, సుభాషిణి,అమీర్, మహేష్, తిలక్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించండి: సీఐ

గుంతకల్లుటౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలని టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్ సూచించారు. పట్టణంలోని శ్రీశైల భ్రమరాంబ డిగ్రీ కళాశాలలో శనివారం ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో మోడల్ డీఎస్సీ పరీక్షను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐ హాజరయ్యారు. ముందుగా సర్వేపల్లిరాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ ద్వారా 16వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులకు వరమన్నారు. నిరుద్యోగులకు మోడల్ డీఎస్సీ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతిఒక్కరూ కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. సొసైటీ కార్యదర్శి రాయల్ రంగ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్లకు శిక్షణ

కూడేరు, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్‌సీసీ నగర్‌లో శనివారం 6వ ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ కేడెట్లకు శిక్షణ ప్రారంభమైంది. బెటాలియన్ కమాండెంట్ కల్నల్ ఎం ఎస్. కులకర్ణి పర్యవేక్షణలో 500 మంది కేడెట్లకు శిక్షణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా కమాండెంట్ కల్నల్ మాట్లాడుతూ ఈ కేడెట్లకు క్రమశిక్షణతో పాటు క్విజ్, వక్తృత్వ, వ్యాస రచన, స్లోగన్స్, తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నామన్నారు. పదిరోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన

కూడేరు:మండలంలోని ఎన్‌సీసీ నగర్‌లో గల ఎన్‌సీసీ కేడెట్లకు సైబర్ నేరాల పట్ల సైబర్ నేర విభాగం సిబ్బంది షెక్షావలి, మెర్సీ అవగాహన కల్పించారు. వివిధ రూపాల్లో మోసాలు జరుగుతున్నాయని, సైబర్ మోసాలకు గురైతే తక్షణం 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

మినీ మహానాడుకు తరలిరండి: ఎమ్మెల్యే అశ్మిత్

తాడిపత్రి, మే 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ కమ్యూనిటీ హాలులో ఆదివారం టీడీపీ మినీమహానాడు జరగనుందని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని తన నివాసంలో శనివారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిపై చర్చించేందుకు ఏర్పాటు చేస్తున్న ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

యాడికి: తాడిపత్రి పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ కల్యాణమండపంలో ఆదివారం ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో టీడీపీ మినీ మహానాడు జరగనుందని పార్టీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య శనివారం ప్రకటనలో తెలిపారు. మండలవ్యాప్తంగా ఉన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

నేడు రక్తదానశిబిరం

తాడిపత్రి, మే 24(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు టీడీపీ సీనియర్ నాయకుడు ఎస్వీ రవీంద్రారెడ్డి తెలిపారు. పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై రక్తదానం చేయాలని కోరారు.

ఘర్షణలో ఐదుగురికి గాయాలు

యల్లనూరు, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడవండ్లపల్లి గ్రామంలో బోరు విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి ఐదుగురికి గాయాలైనట్లు ఏఎస్ఐ సంపత్ తెలిపారు. గ్రామంలో జయరామకృష్ణ, నారాయణస్వామిల మధ్య కొన్నేళ్లుగా భూతగాదా ఉంది. అయితే తగాదా ఉన్న భూమిలో నారాయణస్వామి శుక్రవారం అర్ధరాత్రి బోరు వేస్తుండగా జయరామకృష్ణ అడ్డు తగిలారు. ఈ విషయంలో మాటా మాటా పెరిగి ఘర్షణ చోటు చేసుకుంది. ఇందులో ఇరువర్గాల వారు ఒకరిపైఒకరు దాడులు చేసుకోవడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. వారిని స్థానికులు తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

29వ డిస్ట్రిబ్యూటరీ పరిశీలన

పుట్లూరు, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బరాయసాగర్ వద్ద గల 29వ డిస్ట్రిబ్యూటర్ కాలువను హెచ్చెల్సీ రాయలసీమ సర్కిల్ ఇంజనీర్, ఎస్ఈ రమణారెడ్డి, డీఈ సూర్యనారాయణ తదితరులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వీటికింద ఎంత ఆయకట్టు ఉందని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గత మూడేళ్ల నుంచి కాలువకు నీరు రావడం లేదని ఇటీవలే ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ మేరకు వచ్చే ఏడాది కాలువకు నీటిని విడుదల చేసేందుకు కృషి చేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు సుదర్శన్‌నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీషర్ట్‌ల పంపిణీ

గుంతకల్లు టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కనదొడ్డి పంచాయతీలో ఐఓసీఎల్, న్యాక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రంలో మహిళలకు సర్పంచ వరలక్ష్మీబాయి శనివారం టీషర్ట్‌లు, క్యాప్‌లను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఐఓసీఎల్, న్యాక్ ఆధ్వర్యంలో నక్కనదొడ్డి పంచాయతీలో నాలుగు గ్రామాల మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తున్నామన్నారు. అందులో భాగంగా శిక్షణ పొందుతున్న వారికి ఉచితంగా ఒక టీషర్ట్, క్యాప్‌ను అందజేశామన్నారు. న్యాక్ డైరెక్టర్ గోవిందరాజులు, శిక్షణ మేనేజర్ సుధాకర్, టీడీపీ నాయకుడు బొజ్జనాయక్ పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూ నాయకుల సంబరాలు

గుంతకల్లు టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చే 1/2029 సర్క్యులర్‌ను అమలు చేయాలని ఏపీఆర్టీసీ ఎండీకి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శనివారం ఎన్ఎంయూ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్క్యులర్‌ను అమలు చేసేందుకు ఆదేశాలను ఇవ్వడం సంతోషకరమన్నారు. ఇందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర నాయకుడు ఎర్రిస్వామి, జోనల్ నాయకుడు నాగసుధ, డిపో సెక్రటరీ నటరాజ్, గ్యారేజ్ సెక్రటరీ రమణ, నాయకులు పాల్గొన్నారు.

తెగుళ్ల బారిన వేరుశనగ

- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు


బసంపల్లిలో సాగు చేసిన వేరుశనగ పంట


వేరుశనగకు సోకిన తెగులు

శెట్టూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ముందస్తుగా వర్షాలు కురుస్తుండడంతో నెల క్రితం మండలంలోని బసంపల్లి, అనుంపల్లి, కునుకూరు, చిన్నంపల్లి గ్రామాల్లో రైతులు వందలాది ఎకరాల్లో వివిధ వంటలు సాగు చేశారు. అయితే వేరుశనగ పంటకు ప్రస్తుతం వచ్చ పురుగు, అగ్గి తెగులు, పొగాకు లద్దె పురుగు ఉధృతి ఎక్కువైంది. లక్షలాది రూపాయల పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు ఇలా తెగుళ్ల బారిన పడడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వ్యవసాయాధికారులు పంటలను పరిశీలించి ప్రభుత్వం ద్వారా సబ్సిడీపై పురుగు మందులు అందించేలా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

రసాయనాలు వాడితే కఠినచర్యలు


తోటలో మామిడి పండ్లను పరిశీలిస్తున్న ఆహార నియంత్రణాధికారి

కుందుర్పి, మే 24(ఆంధ్రజ్యోతి): మామిడి పండ్లను రసాయనాలు వాడి కృత్రిమంగా మగ్గిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఆహార నియంత్రణాధికారి రామచంద్ర హెచ్చరించారు. మండలంలోని కరిగానపల్లిలో మామిడి తోటలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యాపారులు లాభాపేక్ష కోసం రసాయనాలు వాడి పండ్లను కృత్రిమ మగ్గించి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడితే ఊరుకోబోమని హెచ్చరించారు. తర్వాత మామిడితోటల నుంచి కొన్ని మామిడి పండ్ల శాంపుల్స్ సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ విజయశాంతి, రైతులు, మామిడి పండ్ల వ్యాపారులు పాల్గొన్నారు.

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి


టోర్నీని ప్రారంభిస్తున్న కాలవ భరత్

బొమ్మనహాళ్, మే 24(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో యువత క్రీడల్లో రాణించాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్, తుంగభద్ర ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కేశవరెడ్డి, ఎస్ఐ నబీరసూల్ సూచించారు. మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో గల హైస్కూల్ క్రీడా మైదానంలో శనివారం వారు కేసీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువత క్రీడల్లో రాణించాలనే ఉద్దేశ్యంతో ఈ టోర్నీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం దర్గాహొన్నూరు, గోవిందవాడ గ్రామాల జట్లు మ్యాచ్‌లో పాల్గొన్నాయి. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు వై. వెంకటేశులు, జిల్లా అధికారి ప్రతినిధి నాగరాజు, మాజీ డైరెక్టర్లు మహేంద్ర, వయ్యావుల అనిల్, నాయకులు నవీన్, సైకిల్ షాప్ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి : సీపీఎం

గుంతకల్లు టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం జూన్ 2వ తేదీన స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మహా ధర్నా జరగనుందని, విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. సీపీఎం కార్యాలయంలో శనివారం వారు పార్టీ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పట్టణంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26నుంచి జూన్ 1వ తేదీ వరకు పోరుబాటు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అనంతరం 2న మహాధర్నా చేపట్టనున్నట్లు చెప్పారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బీ శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేమకల్లు అంజన్నకు విశేష పూజలు


ప్రత్యేకాలంకరణలో నేమకల్లు అంజనేయస్వామి

బొమ్మనహాళ్, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం పుష్పాలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు. తర్వాత మహా మంగళ హారతి ఇచ్చి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విప్రమలై లక్ష్మీనరసింహాలయంలో..

రాయదుర్గంరూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపురం సమీపంలో వెలసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేకపూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు ఉదయాన్నే ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అలాగే వడ్రవన్నూరు సమీపంలో గల ఆపులాపురం ఆంజనేయస్వామి ఆలయంలోనూ పూజలు జరిగాయి.

భక్తిశ్రద్ధలతో రోషన్‌షా వలి ఉరుసు

కళ్యాణదుర్గం, మే 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వన్నూరుస్వామి కొండపై రోషన్‌షావలి ఉరుసును శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొలుత నిర్వాహకులు స్వామిని అలంకరించి పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. అనంతరం కొండపైకి తీసుకెళ్లి ప్రార్థనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్థానికులే కుండా కర్ణాటక ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వైభవంగా పల్లకి సేవ

ఉరవకొండ, మే 24(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకిసేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు తొలుత ఆలయంలో స్వామి, అమ్మవారి మూల విరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బహుమతుల పంపిణీ

పెద్దవడుగూరు, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అవులాంపల్లి గ్రామంలో హనుమజ్జయంతి సందర్భంగా రాతిదూలం పోటీలు జరుగుతున్నాయి. అందులో శనివారం నిర్వహించిన న్యూకేటగిరి విభాగంలోని విజేతల వృషభాల యజమానులకు నగదు బహుమతులను అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ధర్మవరానికి చెందిన ఆర్‌కే బుల్స్ వారికి చెందిన వృషభాలు మొదటిస్థానంలో నిలిచి రూ.80వేలు బహుమతిని సాధించాయి. అలాగే హైదరాబాద్‌కు చెందిన ఆర్‌ఆర్ బుల్స్ వృషభాలు రెండో స్థానంలో నిలిచి రూ.60వేలు, పల్నాడు జిల్లా కోనూరు మండలం వీరబ్రహ్మనాయుడుకు చెందిన వృషభాలు మూడో బహుమతిగా రూ.50 వేలు, నాగర్‌కర్నూలు జిల్లా పెద్దకొత్తపల్లి మండలానికి చెందిన శ్రవణ్ కుమార్ వృషభాలు నాలుగో బహుమతిగా రూ.40వేలు సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు.

నాణ్యమైన విత్తన వేరుశనగను సరఫరా చేయాలి

గుత్తి, మే 24(ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తన వేరుశనగ కాయలను సరఫరా చేయాలని ఏడీఏ వెంకటరాముడు పేర్కొన్నారు. పట్టణంలోని పవన్ ఆగ్రో ఏజెన్సీ విత్తన శుద్ధి కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వేరుశనగ విత్తన నాణ్యతను , శుద్ధి చేసి ప్యాకింగ్ చేసిన వేరుశనగ బస్తాలను, విత్తనంలో తేమ శాతాన్ని, సిల్లింగ్ పాయింట్ పర్సెంటేజ్ ఆయిల్ శాతాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. విత్తన శుద్ధి చేసేటప్పుడు ఖచ్చితంగా నిబంధనలు పాటించాలని అక్కడి సిబ్బందికి సూచించారు. నాణ్యమైన విత్తన కాయలు మాత్రమే పంపిణీ కేంద్రాలకు సరఫరా చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ ముస్తాక్ అహ్మద్, ప్రాసెసింగ్ యూనిట్ ఇన్‌చార్జి మెహరున్నీసా బేగం, ఎంపీఈఓ కృష్ణభగవాన్ పాల్గొన్నారు.

చెరువులకు నీటి విడుదలకు ఎమ్మెల్యే ప్రయత్నం

యల్లనూరు, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలో గండికోట చిత్రావతి ఎత్తిపోతల పథకంలో భాగమైన యల్లనూరు, గడ్డంవారిపల్లి చెరువులకు నీటి విడుదల చేయించేందుకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ప్రయత్నం చేస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ రామాంజనేయులు, నాయకుడు అనిల్‌కుమార్‌చౌదరి తెలిపారు. మండకేంద్రంలో శనివారం వారు మాట్లాడారు. ఈ రెండు చెరువుల్లో నీరు అడుగంటిపోవడం వలన బోర్ల లో భూగర్భజలాలు తగ్గిపోయాయన్నారు. దీంతో పండ్లతోటలకు నీటి సమస్య తలెత్తే అవకాశం ఉందన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ఈ రెండు చెరువులకు నీరు వదలడానికి ఎమ్మెల్యే ఇప్పటికే గాలేరి నగరి సుజల స్రవంతి అధికారులతో మాట్లాడారని తెలిపారు. ఈ విషయాన్ని మండల టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే చర్చించినట్లు వారు పేర్కొన్నారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవంపై ర్యాలీ

శెట్టూరు, మే 24(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలో శనివారం ఎంపీడీఓ జిలాని సిబ్బందితో కలిసి ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలను నాటి పరిరక్షించాలని సూచించారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

రాయదుర్గం రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలో ఐదెకరాలు ఉన్న చిన్న, సన్నకారురైతులు ఉపాధి హామీ కింద పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ దేవరాజ్ శనివారం ప్రకటనలో సూచించారు. ప్రభుత్వం మండలానికి 380 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ప్రతి పంచాయతీకి 20 ఎకరాల చొప్పున పండ్లతోటల పెంపకానికి వెసులుబాటు కల్పించిందన్నారు. అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కౌలు రైతు సంఘం కమిటీ ఎన్నిక

ఉరవకొండ, మే 24(ఆంధ్రజ్యోతి): కౌలు రైతు సంఘం నియోజకవర్గ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య ఆధ్వర్యంలో కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా సురేష్, కార్యదర్శిగా వెంకటేష్‌లు, ఉపాధ్యక్షులుగా శివప్ప, శీనప్పసిద్ధార్థ, కార్యవర్గ సభ్యులుగా తిమ్మప్ప, నారాయణస్వామి, మురళి, ధనుంజయ ఎన్నికయ్యారు.

అధికలోడుతో వెళితే కఠినచర్యలు : ఎస్ఐ

పుట్లూరు, మే 24(ఆంధ్రజ్యోతి): వాహనాల్లో అధికలోడుతో ప్రయాణికులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకటనరసింహం హెచ్చరించారు. మండల కేంద్రంలో శనివారం ఆయన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో ఆటోల్లో, బొలెరో వాహనాల్లో పరిమితికి మించి కూలీలను తరలిస్తుండడంతో నిలిపి డ్రైవర్లను మందలించారు. పరిమితికి మించి వాహనాల్లో ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. ఇలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయా వాహనాలకు జరిమానా విధించారు.

ఘనంగా తిరంగా ర్యాలీలు

బెళుగుప్ప, మే 24(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో మండల కేంద్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో పాటు వివిధ శాఖల అధికారులు మండలకేంద్రంలో తిరంగా యాత్ర ర్యాలీని ఘనంగా నిర్వహించారు. పాకిస్థాన్‌పై భారత్ యుద్ధం గెలవడంతో ఆనందం వ్యక్తం చేస్తూ.. భారత్ సైనికులకు మద్దతుగా 40 అడుగుల జాతీయ జెండాతో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ప్రతిఒక్కరూ భారత్ మాతాకీ జై అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం యుద్ధంలో వీరమరణం పొందిన భారత సైనికులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఎంఈవో మల్లారెడ్డి, డీటీ సురేఖ, బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు మనోహర, మధు, సుధాకర్, బాలాజీ, అనిల్, శివ, ధనుంజయ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

●పుట్లూరు: మండలకేంద్రంలో ప్రజలు, పలు ప్రజాసంఘాలు, పార్టీల నాయకులు, ఉద్యోగులు కలిసి తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిఒక్కరూ జాతీయ జెండాను చేతబూని భారత్‌మాతాకి జై అంటూ నినాదాలుచేశారు. ప్రధాన వీధుల గుండా ర్యాలీని కొనసాగించారు. ప్రధాని నరేంద్రమోడీకి మనమంతా అండగా ఉందామని పిలుపునిచ్చారు.

●గుత్తి: పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల వారు తిరంగా యాత్ర ర్యాలీని నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ సత్తా చాటిన సైనికులకు మద్దతుగా జాతీయ జెండాలు చేతపట్టుకుని ర్యాలీని నిర్వహించారు. అనంతరం ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన సైనికులు, పర్యాటకులకు నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, ఏఈఓ ఇంతియాజ్ బాషా, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


బెళుగుప్పలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు



పుట్లూరులో ..



గుత్తిలో గేట్స్ విద్యార్థులు..